RNI NO. TELTEL/2021/81092 Published from Jagtial Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8
సంచిక (Issue) : 300 వెల - రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు prajamantalu.com

బుధవారం 15, మార్చి 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

## కొత్తరకం సైబర్ మోసం




- డబ్బు సంపాదించ వచ్చంటూ మోసం
- కోట్లు దండుకుని ఉడాయించిన కేటుగాళ్లు

హైదరాబాద్,మార్చి14(ప్రజామంటలు): సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఆ ఉచ్చులో పడి అమాయకులు మోసపోతున్నారు. రోజుకో కొత్త రకం మోసంతో నేరగాళ్లు వల వేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించొచ్చు అనుకున్నవాళ్ల ఆశల్ని సొమ్ము మిగతా... 2లో




## ఉభయ సభల్లో మళ్లీ గందరగోళం

- ఆదానీ వ్యవహారంపై జెపిసికి డిమాండ్
- ప్రభుత్వ తీరుకు నిరసనగా ఎంపిల ఆందోళన

న్యూఢిల్లీ,మార్చి14(ప్రజామంటలు): వరుసగా రెండోరోజూ పార్లమెంటులో ఆదానీ వ్యవహారం గందరగోళానికి దారితీసింది. దీనిపై జెపిసి వేయాలని కోరుతూ బిఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. వాయిదా తీర్మానాలపై చర్చించాలని విపక్షాలు పట్టుబట్టాయి. లోక్‌సభలో ఇవాళ విపక్ష పార్టీలు ఆందోళన చేపట్టాయి. అదానీ అంశంపై జేపీసీ వేయాలని డిమాండ్ చేశాయి. ప్రశ్నోత్తరాలను అడ్డుకున్నాయి. దీంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. బీఆర్ఎస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీలు కూడా పార్లమెంట్‌లో నిరసన చేపట్టారు. అదానీ అంశంపై జేపీసీ విచారణ చేపట్టాలని రెండు మిగతా... 2లో




## కాళేశ్వరం అక్రమాలపై సిబిఐ విచారణ

- ఢిల్లీ వేదికగా జంతర్‌మంతర్ వద్ద షర్మిల ఆందోళన
- రాష్ట్రపతి భవన్‌కు మార్చ్‌ను అడ్డుకున్న పోలీసులు
- అరెస్ట్ చేసి పార్లమెంట్ స్ట్రీట్ స్టేషన్‌కు తరలింపు

న్యూఢిల్లీ,మార్చి14(ప్రజామంటలు): తెలంగాణ సిఎం కెసిఆర్ అవినీతి, అక్రమాలపై విచార చేయాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అవినీతి పాలనపై మంగళవారం షర్మిల, వైఎస్ఆర్‌టీపీ శ్రేణులు పార్లమెంట్ మార్చ్ చేపట్టారు. కాగా.. షర్మిల పార్లమెంట్ మార్చ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వైఎస్సార్టీపీ శ్రేణులు, మిగతా... 2లో

## పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో లీకేజీలు




- పేపర్ల లీకేజీలతో నిరుద్యోగుల ఆందోళన
- నిందితుడు ప్రవీణ్ వ్యవహారంపై నిగ్గు తేల్చాలి
- రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు..ఆందోళనలు
- అత్యవసరంగా సమావేశమూ చర్చించిన కమిషన్

హైదరాబాద్,మార్చి14(ప్రజామంటలు): టీఎస్పీఎస్సీలో ప్రశ్నా పత్రాల లీకేజీ వ్యవహారం సంచలనంగా మారింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు, ప్రతిపక్ష పార్టీలు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు. పేపర్ లీకేజీకి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇకపోతే ఈ పేపర్ లీకేజీ వ్యవహారంలో సంచలన విషయాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. నిందితుడు ప్రవీణ్ గ్రూప్-1 పరీక్ష రాశాడనే ప్రచారం సాగుతోంది. దీనిపై టీఎస్పీఎస్సీ అధికారులు సీరియస్ గా దృష్టి సారించారు. ప్రవీణ్ రాసిన ప్రిలిమినరీలో అతడికి 103 మార్కులు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రవీణ్ ఓఎంఆర్ షీట్ అంటూ సోషల్ మీడియాలో ఒక ఫొటో మాత్రం వైరల్‌గా మారింది. కేసు విచారణలో భాగంగా ప్రస్తుతం నిందితుల కాంటాక్ట్ లిస్ట్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే నిందితుల ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఈ కేసులో ప్రవీణ్, రాజశేఖర్, రేణుక సహా 9 మంది అరెస్ట్ అయ్యారు. అయితే గ్రూప్ -1 పేపర్ లీక్ అయిన విషయంపై ఇంకా స్పష్టత లేదని నగర శాంతి భద్రతల అదనపు సీపీ విక్రమ్ సింగ్ అన్నారు. టీఎస్పీఎస్సీ కార్యాలయం వద్ద భద్రతను పర్యవేక్షించిన సీపీ.. ఇప్పటి వరకు గ్రూప్-1 పేపర్ లీక్ అయినట్లు తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు. కేవలం తమకు ఉన్న సమాచారం ప్రకారం టీఎస్ పీఎస్ సీ మిగతా... 2లో

## టీఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీ వెనుక పెద్ద కుట్ర

- సిఎం కెసిఆర్‌కు సంబంధం ఉందనే అనుమానం
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాల్సిందే
- బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్



హైదరాబాద్,మార్చి14(ప్రజామంటలు): టీఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీ వెనుక పెద్ద కుట్ర దాగా ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. ఈ విషయంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపింపాలని, గవర్నర్ జోక్యం చేసుకోవాలని అన్నారు. టీఎస్పీఎస్సీ నిర్వహించిన పరీక్షలకు సంబంధించి ప్రశ్నా పత్రాలన్నీ లీక్ అయ్యాయని ఆయన ఆరోపించారు. గతేడాది నిర్వహించిన గ్రూప్-1 పరీక్షా పత్రం సైతం లీక్ అయ్యిందని చెప్పారు. తక్షణమే సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణకు ఆదేశించడంతోపాటు ఈ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీఎస్పీఎస్సీ సెక్రటరీ పీఏ ప్రవీణ్ ఈ ప్రశ్నాపత్రాన్ని లీక్ చేయడంతో పాటు తానే స్వయంగా పరీక్ష రాశారని సంజయ్ మిగతా... 2లో



## పెద్దనోట్ల రద్దు అట్టర్ ప్లాప్

- దేశానికి రూ. 5 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది
- దేశ ప్రజలకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలి
- రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్,మార్చి14(ప్రజామంటలు): పెద్ద నోట్ల రద్దు అట్టర్ ప్లాప్ అయిందని, దీని వల్ల దేశానికి రూ. 5 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. పెద్దనోట్ల రద్దు, దాని పర్యావసనాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, దేశ ప్రజలకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. దేశంలో నల్లధనం అవినీతి మిగతా... 2లో



## ఓడిఎఫ్ పంచాయితీలుగా తెలంగాణ

- పంచాయితీరాజ్ పథకాలపై సమీక్షలో సిఎస్

హైదరాబాద్,మార్చి14(ప్రజామంటలు): దేశంలోనే అన్ని గ్రామ పంచాయతీలను ఓడీఎఫ్ ప్లస్‌గా ప్రకటించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పేర్కొన్నారు. రాష్ట్రంలో పల్లె ప్రగతి, హరితహారం లాంటి రాష్ట్ర ప్రభుత్వ విప్లవాత్మక కార్యక్రమాల వల్లనే వందశాతం గ్రామాలు ఒడిఎఫ్‌గా మారాయని సీఎస్ అన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు గణనీయంగా పెరగడంతోపాటు గ్రామ పంచాయతీల పాలన మెరుగుపడిందన్నారు. రాష్ట్రంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అమలవుతున్న పలు పథకాల పురోగతిని సిఎస్ శాంతికుమారి మంగళవారం సమీక్షించారు. పల్లె ప్రగతి,జాతీయ ఉపాధి హామీ పథకం గామీణ సడక్ యోజన, స్వయం సహాయక బృందాల పనితీరు తదితర మిగతా... 2లో




## సర్వీస్ కమిషన్ కార్యాలయం ముట్టడి

- ప్రగతిభవన్ డైరెక్షన్‌లో పేపర్ లీకేజి
- ఆందోళననకు దిగిన విద్యార్థి సంఘాలు
- చిక్కడపల్లిలో నిరుద్యోగుల నిరసన
- మద్దతు ప్రకటించిన ప్రొఫెసర్ కోదండరామ్

హైరాబాద్,మార్చి14(ప్రజామంటలు): సర్వీస్ కమిషన్ పేపర్ల లీకేజీ వ్యవహారంపై బిజెపి అనుబంధ విద్యార్థులు ఆందోళనకు దిగారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆఫీస్ మిగతా... 2లో






## సమస్యలపై కదం తొక్కిన మహా రైతులు

- నాసిక్ నుంచి ముంబై వరకు భారీ నిరసన ర్యాలీ

ముంబై,మార్చి14(ప్రజామంటలు): తమ సమస్యల పరిష్కారం కోసం మహారాష్ట్ర రైతులు కదం తొక్కారు. నాసిక్ నుంచి ముంబై వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో వేలాది మంది రైతులు పాల్గొన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ మిగతా... 2లో




## లీకేజ్ నిందితులకు 14 రోజుల రిమాండ్

హైదరాబాద్,మార్చి14(ప్రజామంటలు): టీఎస్ పీఎస్సీ పేపర్ లీకేజ్ కేసులో 9 మంది నిందితులకు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. పోలీసులు 8 మంది నిందితులను చర్లపల్లి జైలుకు, మరో నిందితురాలు రేణుకను చంచల్ గూడ మహిళా జైలుకు తరలించారు. మరోవైపు ఈ కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పేపర్ ఎక్కడ లీకేజ్ అయిందో పోలీసులు గుర్తించారు. మహబూబ్ నగర్ జిల్లా గండేడ్ తండాకు 50 కి.మీ దూరంలో ఇద్దరు పేపర్ మార్చుకున్నట్లు పోలీసులు గుర్తించారు. గండేడ్ లో పేపర్లు తీసుకున్న ఆ ఇద్దరు ఎవరనేదానిపై విచారణ కొనసాగుతోంది. పేపర్ లీక్‌పై పోలీసులకు ఫిర్యాదు ఇచ్చిన ఆ ఇద్దరు అభ్యర్థులెవరనేది కూడా ప్రశ్నార్థకంగా మారింది. అయితే దీనిపై పోలీసులు ఎందుకు పరిధి దాటి విచారించడం లేదనేది చర్చనీయాంశంగా మారింది.



## తెలంగాణలో అత్యధిక విద్యుత్ వినియోగం

- 15254 మెగావాట్ల విద్యుత్‌తో అత్యధిక పీక్ డిమాండ్ నమోదు
- ట్రాన్స్‌కో, జెన్కో సీఎండీ ప్రభాకర్ రావు వెల్లడి

హైరాబాద్,మార్చి14(ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే మంగళవారం మరోమారు అత్యధిక విద్యుత్ వినియోగం జరిగినట్టు ట్రాన్స్‌కో, జెన్కో సీఎండీ ప్రభాకర్ రావు పేర్కొన్నారు. మార్చి నెలలో అనుకున్న విధంగానే 15000 మెగా వాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైందన్నారు. ఇవాళ ఉదయం 10.03 మిగతా... 2లో

# ఆస్కార్ చిత్రాలకు రాజ్యసభలో అభినందనలు

## పంచ్‌లతో ఆకట్టుకున్న చైర్మన్ ధన్‌కడ్



న్యూఢిల్లీ,మార్చి14(ప్రజామంటలు): ఆస్కార్ అవార్డులు గెలిచిన చిత్రాలను అభినందిస్తూ.. రాజ్యసభలో చైర్మన్ జగదీప్ ధన్‌కర్ మాట్లాడారు. ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని నాటు నాటు పాట, ద ఎలిఫెంట్ విస్పరర్స్ చిత్రాలకు ఆస్కార్స్ వచ్చిన విషయం తెలిసిందే. అయితే సినీ ట్యాలెంట్‌ను మెచ్చుకుంటూ సభ్యులు మాట్లాడుతున్న సమయంలో.. చైర్మన్ జగదీప్ ఓ ఫన్నీ కామెంట్ చేశారు. అడపాదడపా చమత్కారాలు వదులుతున్న చైర్మన్.. ఆస్కార్ విజేతలకు తమిళనాడు ఎంపీ వైకో విషెస్ చెబుతున్న సమయంలో ఓ పంచ్ వేశారు. ఒకవేళ తాను వకీలు కాకుంటే, అప్పుడు కచ్చితంగా యాక్టర్‌ను అయ్యేవాడినని అన్నారు. దీంతో సభలో నవ్వులు పూశాయి. వివిధ పార్టీల సభ్యులు మాట్లాడుతున్న సమయంలో.. చైర్మన్ జగదీప్ వేస్తున్న పంచ్‌లు సభలో అందర్నీ ఆకట్టుకుంటు న్నాయి. జయాబచ్చన్ మాట్లాడుతున్న సమ యంలో.. బీజేపీ సభ్యులు అల్లరి చేశారు. ఆ సమయంలో జయా కొంత ఆగ్రహానికి గుర య్యారు. అప్పుడు ఆమెను జగదీప్ మెచ్చుకున్న తీరు ఆమెను స్టన్ చేసింది. గొప్ప కుటుంబంలో పుట్టిన మీకు.. క్రియేటివిటీ మీ డీఎన్ఏలోనే ఉందంటూ ఆయన కామెంట్ చేశారు. ఆ పంచ్‌కు జయా కూడా కౌంటర్ ఇవ్వలేకపోయారు. బెంగాల్ గవర్నర్‌గా చేసిన ధనకర్.. ఆ రాష్ట్రానికి చెందిన ఓ ఎంపీ మాట్లాడుతున్న సమయంలో మనది పురానా రిస్తా అంటూ తన సెన్స్ ఆఫ్ హ్యూమర్‌తో ఆకర్షించారు.

# వదోదరలో వైరస్‌తో మహిళ మృతి

## నమూనాలను పరీక్షలకు పంపిన వైద్యులు



గాంధీనగర్,మార్చి14(ప్రజామంటలు): దేశంలో సీజనల్ ఎన్‌ఫ్లు యెంజా హెచ్3ఎన్2 కేసులు దేశవ్యాప్తంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో వైరస్‌ను ఎదుర్కొనేందుకు అన్ని దవాఖానాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశించింది. మరో వైపు గుజరాత్ వదోదర ప్రభుత్వ ఆసుపత్రిలో ఫ్లూ లాంటి లక్షణాలతో ఓ మహిళ మృతి చెందింది. ఈ విషయాన్ని అధికారులు మంగళవారం ధ్రువీకరించారు. అయితే, మృతికి కారణం హెచ్3ఎన్2 వైరస్ కారణమా కాదా అన్నది తెలుసుకునేందుకు నమూనాలను పరీక్షల కోసం పంపినట్లు తెలిపారు. సదరు మహిళ (68) సోమవారం మరణించినట్ల ఎస్ఎస్‌జీ హాస్పిటల్ వైద్యులు తెలిపారు. నమూనాలను సేకరించి పరీక్షల కోసం పంపామని, మహిళ మృతికి గల కారణాలను కమిటీ సమీక్షిస్తుందని పేర్కొన్నారు. మృతులు వడోదరలోని ఫతేగంజ్ నివాసి. అయితే, ఈ ఏడాది సీజనల్ ఇన్‌ఫ్లుయెంజా కేసులు ఈ ఏడాది గుజరాత్‌లో ఇప్పటి వరకు మూడు కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది మార్చి 10 వరకు గుజరాత్‌లో 80 సీజనల్ ఫ్లూ కేసులు నమోదయ్యాయని, ఇందులో హెచ్1ఎన్1 కేసులు 77 ఉన్నాయని, మరో మూడు హెచ్3ఎన్2 కేసులని అధికారులు పేర్కొన్నారు. అయితే హెచ్3ఎన్2 వైరస్ కారణంగా ఇప్పటి వరకు ఇక్కడ మరణం నమోదు కాలేదని వివరించారు.

# సర్వీస్ కమిషన్ కార్యాలయం ముట్టడి

**మొదటిపేజీ తరువాయి..**

ముట్టడికి విఫలయత్నం చేశారు. ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చినట్లే ఇచ్చి.. పేపర్లు లీక్ చేసి అర్హులైన అభ్యర్థులకు అన్యాయం చేస్తున్నారంటూ విద్యార్థులు భగ్గుమన్నారు. ఎగ్జామ్ పేపర్లను అమ్ముకుంటూ.. నిరుద్యోగులను దారుణంగా మోసం చేస్తున్నారని ఆందోళనకారులు మండిపడ్డారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆఫీస్ బోర్డును పీకేశారు.. గేట్లు దూకారు.. ఆఫీసులోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో.. ఆందోళనకారులను బలవంతంగా అక్కడి నుంచి పోలీసులు లాక్కెళ్లారు. సంవత్సరాల తరబడి కష్టపడి చదువుతుంటే.. పేపర్లు లీక్ చేసి మోసం చేస్తున్నారని.. అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు స్టూడెంట్స్. పేపర్ లీకేజీలు ప్రగతి భవన్ డైరెక్షన్‌లో జరుగుతున్నాయంటూ ఆరోపించారు.. ఇంజినీరింగ్ విభాగంలోని టౌన్ ప్లానింగ్ ఎగ్జామ్ పేపర్ లీక్ తరహాలోనే.. గ్రూప్ వన్, ఇతర కాంపిటీషన్ ఎగ్జామ్స్ పేపర్లు కూడా లీక్ చేసి ఉంటారనే అనుమానాలను సైతం వ్యక్తం చేసారు. పరీక్షల పేపర్లును కాపాడుకోకపోతే టీఎస్పీఎస్సీ బోర్డు ఎందుకని ప్రశ్నించారు. ప్రగతి భవన్ కనుసన్నల్లోనే టీఎస్పీఎస్సీలో పేపర్ లీకైందని ఆరోపించారు. ఈ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న బీజేపీ విద్యార్థుల సంఘాల నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. బలవంతంగా లాక్కెళ్లారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. మరోవైపు టీఎస్పీఎస్సీలో పేపర్ లీకేజీపై నిరుద్యోగులు రోడ్డెక్కారు.హైదరాబాద్ చిక్కడపల్లిలోని సెంట్రల్ లైబ్రరీ దగ్గర ఆందోళనకు దిగారు. తిండి తిప్పలు మానేసి కష్టపడి చదివినా తమకు ఉద్యోగం రాలేదని..అలాంటి ప్రవీణ్ అనే వ్యక్తికి వందకు పైగా మార్కులు రావడమేంటని ప్రశ్నించారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీకి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పకడ్బందీగా ఉండే టీఎస్పీఎస్సీ ఆఫీసులో పెన్ డ్రైవ్ ద్వారా పేపర్ కాపీ చేయడం అంత ఆశామాషీ కాదని..ఇది సంస్థలో పనిచేసే ఉద్యోగుల సహకారంతోనే సాధ్యమైందని ఆరోపించారు. నిర్వహణ నిర్లక్ష్యంతోనే టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ జరిగినట్లు ఆరోపిస్తున్నారు. టీఎస్పీఎస్సీ ఛైర్మన్ బి జనార్ధన్ రెడ్డి దీనికి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే టీఎస్పీఎస్సీని యూపీఎస్సీకి అటాచ్ చేయాలన్నారు. గ్రూప్ 1 పేపర్ కూడా లీకైనట్లు విద్యార్థులు అనుమానం వ్యక్తం చేసారు. గ్రూప్ 1 పరీక్ష రాసిన విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. తాము కూడా లీకేజీతోనే ఫెయిలయ్యామా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది అక్టోబర్ 16న గ్రూప్ 1 పరీక్ష జరిగింది. 2.86 లక్షల మంది గ్రూప్ 1 పరీక్ష రాయగా...1:50 నిష్పత్తిలో 25వేల 50 మంది క్వాలిఫై అయ్యారు. నిరుద్యోగుల ఆందోళనకు తెలంగాణ జనసమితి అధ్యక్షుడు మాజీ ప్రొఫెసర్ కోదండరాం మద్దతు తెలిపారు. విద్యార్థుల ఆందోళన న్యాయసమ్మతమైందన్నారు. టీఎస్పీఎస్సీలో పేపర్ లీకేజీ వ్యవహారం హేయమైందని చెప్పారు. దీనిపై విచారణ జరగాలన్నారు. బాధ్యతులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు నిరుద్యోగులంతా కలిసి పోరాడాలని సూచించారు.

# తెలంగాణలో అత్యధిక విద్యుత్ వినియోగం

**మొదటి పేజీ తరువాయి..**

నిమిషాలకు 15254 మెగా వాట్ల విద్యుత్ అత్యధిక ఫీక్ డిమాండ్ నమోదైందని.. ఇది రాష్ట్ర చరిత్రలో అత్యధిక వినియోగ మని ప్రభాకర్ రావు తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. సాగు విస్తీర్ణం పెరగడం, రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలు పెరగడం వంటివి విద్యుత్ వినియోగం పెరగడానికి కారణమన్నారు. మొత్తం విద్యుత్ వినియోగంలో 37 శాతం వ్యవసాయ రంగానిదేనని ప్రభాకర్ రావు తెలిపారు. దేశంలో వ్యవసాయ రంగానికి అత్యధిక విద్యుత్ వినియోగం చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. మొత్తం విద్యుత్ వినియోగంలో దక్షిణ భారతదేశంలో తమిళనాడు మొదటి స్థానం కాగా.. రెండో స్థానంలో తెలంగాణ ఉందన్నారు. నిన్న విద్యుత్ వినియోగం 14 138 మెగా వాట్లు కాగా.. రాష్ట్రం ఏర్పడిన తరువాత అత్యధిక విద్యుత్ డిమాండ్ 15254 మెగా వాట్లు రికార్డ్ స్థాయిలో నమోదు ఇదేనన్నారు. గత సంవత్సరం మార్చి నెలలో 14160 మెగా వాట్ల అత్యధిక విద్యుత్ వినియోగం కాగా.. ఈ సారి గత సంవత్సరం రికార్డ్‌ను అధిగమించి ఈ నెలలోనే 15254 మెగా వాట్ల ఫీక్ డిమాండ్ నమోదు అయిందన్నారు.

ఈ సంవత్సరం వేసవి కాలంలో 16 వేల మెగా వాట్ల డిమాండ్ వచ్చే అవకాశం ఉందని ప్రభాకర్ రావు తెలిపారు. ఎంత డిమాండ్ వచ్చినా సరఫరాకు అంతరాయం లేకుండా చూస్తామన్నారు. మార్చి నెలలో 15000 మెగా వాట్ల విద్యుత్ డిమాండ్ నమోదు అవుతుందని ముందే ఊహించామన్నారు. అందుకు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా కు ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్ర రైతాంగానికి.. అన్ని రకాల వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని ట్రాన్స్ కో, జెన్కో సీఎండీ ప్రభాకర్ రావు వెల్లడించారు.

# ఓడీఎఫ్ పంచాయితీలుగా తెలంగాణ

**మొదటి పేజీ తరువాయి..**

అంశాలపై సీఎస్ సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశానికి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయితీరాజ్ శాఖ కమిషనర్ హనుమంత రావు, తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ..డెంగ్యూ కేసులు గణనీయంగా తగ్గడం, గ్రామ పారిశుధ్యం మెరుగుపడడంతో పాటు గ్రీన్ కవర్ గణనీయంగా పెరిగిందని శాంతి కుమారి పేర్కొన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్లు, ట్రాలీలు సమకూర్చడం జరిగిందని, గ్రామాల్లో డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉపాధి హామీ పథక పురోగతిని సమీక్షిస్తూ, రాష్ట్రంలో1.11 కోట్ల మందికి 52.78 లక్షల జాబ్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. వైకుంఠ ధామములు, డంపింగ్ యార్డులు, నర్సరీలు, ప్లలె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు, రైతు వేదికలు, డ్రైయింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, సీసీ రోడ్లు మొదలైన వాటి నిర్మాణం పూర్తి చేసినట్టు సీఎస్ వెల్లడించారు. వాటర్‌షెడ్ కార్యక్రమం కింద 200 అమృత్ సరోవర్‌లను నిర్మించినట్లు తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ ఫేజ్-11 కింద 42 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లు, 11,60,920 వ్యక్తిగత సోక్ పిట్‌లు, 32,650 సామాజిక సోక్ పిట్‌లను నిర్మించినట్లు చెప్పారు.

# కాళేశ్వరం అక్రమాలపై సిబిఐ విచారణ

**మొదటి పేజీ తరువాయి..**

పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా షర్మిలను ఢిల్లీలో అరెస్ట్ అయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై జేపీసీ వేయాలని, కేంద్ర దర్యాప్తు సంస్థలచే విచారణ జరిపించాలని షర్మిల డిమాండ్ చేశారు. వెంటనే షర్మిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు




పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భారీగా అవినీతి జరిగిందని... దానిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు దేశంలో అతిపెద్ద స్కామన్నారు. దేశప్రజల సొమ్ము లక్షకోట్ల కేసీఆర్ దోచుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ అవినీతికి పాల్పడ్డారని అన్నారు. కమిషన్ల కోసం రీడిజైన్ పేరుతో భారీ అవినీతి జరిగిందని వ్యాఖ్యలు చేశారు. 38 వేల కోట్ల ప్రాజెక్టును లక్షా 50 వేల కోట్లకు పెంచారన్నారు. మూడుసార్లు ప్రాజెక్టు నిర్మాణ వేయం పెంచారని తెలిపారు. ప్రాజెక్టు వల్ల చాలా మంది నిరాశ్రయులు అయ్యారని.. వారికి న్యాయం చెయ్యలేదని మండిపడ్డారు. నాణ్యత లేకుండా ప్రాజెక్టు కట్టారన్నారు. ప్రతి ఏటా వేల వేకరాలు ముంపునకు గురి అవుతాయన్నారు. ప్రాజెక్టులో భారీగా అవినీతి జరిగింది సీబీఐ, ఈడీలతో విచారణ జరపాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఉదయం ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆందోళన చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని, దీనిపై సీబీఐ, ఈడీలతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై విచారించాలని కోరారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నాయకులు, కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. 'కేసీఆర్ హటావో.. తెలంగాణ బచావో' అంటూ నినాదాలు చేశారు. ప్రతి ఏటా వేల ఎకరాల పంట పొలాలు మునిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఒక అద్భుతమంటూ కేసీఆర్ తెలంగాణతో పాటు దేశ ప్రజలను సైతం మోసం చేశారని మండిపడ్డారు. ప్రాజెక్టు నిర్మాణంలో రూ.70 వేల కోట్ల అవినీతి జరిగిందనీ, 2జీ, బొగ్గు కుంభకోణం కంటే.. ఇది పెద్ద స్కామ్ అని ఆరోపించారు. ప్రాజెక్టు రీ డిజైనింగ్ పేరుతో లక్షా 20 వేల కోట్ల ఖర్చుతో కేవలం 18 లక్షల 25 వేల 700 ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చేలా నిర్మించారని వైఎస్ షర్మిల చెప్పారు. ఇంత ఖర్చు చేసి కేవలం లక్షా 50 వేల ఎకరాలకు మాత్రమే కాళేశ్వరం ద్వారా నీళ్లు ఇచ్చారని చెప్పారు.

పంప్ హౌజ్ ల ఎత్తు కూడా చూసుకోకుండా కట్టారని, నాసిరకం పనులు చేశారని ఆరోపించారు. నిర్మాణ పనులపై ఆడిట్ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయడానికే పవర్ బిల్ రూ.3 వేల కోట్లు ఖర్చయిందని, లోన్లకు వడ్డీలే రూ.13 వేల కోట్లు కడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

# టీఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీ వెనుక పెద్ద కుట్ర

**మొదటి పేజీ తరువాయి..**

తెలిపారు. అత్యధికంగా ప్రవీణ్‌కు 103 మార్కులొ చ్చాయని, అందుకు సంబంధించిన ఓఎంఆర్ షీట్‌ను బండి సంజయ్ ప్రస్తావించారు. ప్రవీణ్ కోసం పరీక్షా సమయాన్ని సైతం మార్చారని, అభ్యర్థులందరికీ ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పరీక్ష నిర్వహిస్తే... ప్రవీణ్ పరీక్ష రాసే కాలేజీకి మాత్రం మధ్యాహ్నం తరువాత నిర్వహించారని సంజయ్ తెలిపారు. దీనిపై ఓ పత్రికలో వార్త వచ్చేంతవరకు టీఎస్పీఎస్సీ స్పందించలేదని చెప్పారు. రాబోయే రెండు నెలల్లో జరగబోయే పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలకు సంబంధించిన సమాచారం కూడా కేసీఆర్ టీం వద్ద ఉందనే సమాచారం తమవద్ద ఉందన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఛైర్మన్ కు తెలియకుండా పేపర్ లీక్ కావడం అసాధ్యం అన్నారు. నిబంధనల ప్రకారం.... టీఎస్పీఎస్సీలో కాన్ఫిడెన్షియల్ డిపార్ట్ మెంట్ ఛైర్మన్ పరిధిలో మాత్రమే ఉంటుందని, ఛైర్మన్‌కు తెలియకుండా పేపర్ లీక్ కావడం అసాధ్యమని సంజయ్ అన్నారు. క్వశ్చన్ పేపర్ ఏ ఒక్క ఉద్యోగి కంప్యూటర్లో ఉండటానికి వీల్లేదు. అట్లాంటిది ఒక సెక్షన్ ఆఫీసర్ కంప్యూటర్లో ప్రశ్నాపత్రాలు ఎట్లా ప్రత్యక్షమవుతాయని అన్నారు. వాటిని ప్రవీణ్, రాజశేఖర్ ఎట్లా పెన్ డ్రైవ్ లోకి తీసు కుంటారు? టీఎస్పీఎస్సీ ఛైర్మన్, కార్యదర్శి ప్రమేయం లేకుండా ఇది అసాధ్యం? అని సంజయ్ ప్రశ్ని?ంచారు. తెలంగాణలోని లక్షలాది నిరుద్యోగుల జీవితాల తో ముడిపడి ఉన్న ఈ అంశాన్ని కేసీఆర్ ప్రభుత్వం తేలికగా కొట్టిపడేసేందుకు యత్నిస్తోందని సంజయ్ ఆరోపించారు. ఉద్యోగాలను భర్తీ చేయడం కేసీఆర్ కు ఏ మాత్రం ఇష్టం లేదని తెలుస్తోందన్నారు. వాస్తవానికి తెలంగాణలో ఉద్యోగాలను భర్తీ చేయడం సీఎం కేసీఆర్ కు ఏ మాత్రం ఇష్టం లేదన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా పూర్తిగా దివాళా తీయించిన కేసీఆర్ కొత్త ఉద్యోగాలను భర్తీ చేయలేని స్థితిలో ఉన్నారని చెప్పారు. లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని అసెంబ్లీలో ఇచ్చిన హామీని అమలు చేయడం అసాధ్యమని తెలిసి... నోటిఫికేషన్లు, ప్రశ్నాపత్రాల లీకేజీ పేరుతో కాలయాపన చేస్తూ నిరుద్యోగుల నోట్లో మట్టి కొడుతున్నారు. అందులో భాగంగానే గ్రూప్-1సహా ఇతర పరీక్షా పత్రాలన్నీ లీకేజీ చేస్తున్నట్లు అర్థమవుతోందన్నారు.

# పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో లీకేజీలు

**మొదటి పేజీ తరువాయి..**

అసిస్టెంట్ ఇంజనీరింగ్ పేపర్ లీక్ అయినట్లు వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తులో ఉందని.. పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు ప్రవీణ్ తో పాటు 8 మందిని అరెస్ట్ చేశామని చెప్పారు. టీఎస్ పీఎస్ సీ పేపర్ లీక్ కేసులో కీలక నిందితుడు ప్రవీణ్ గ్రూప్- 1 పరీక్ష రాశాడనే ప్రచారం సాగుతోంది. దీనిపై టీఎస్ పీఎస్ సీ అధికారులు సీరియస్‌గా దృష్టి సారించారు. ప్రవీణ్ రాసిన ప్రిలిమినరీలో అతడికి 103 మార్కులు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రిలిమ్స్ పేపర్‌ను ప్రవీణ్ లీక్‌చేశాడా అనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. లీకేజీపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక భేటీ నిర్వహించింది. సర్వీస్ కమిషన్ చైర్మన్ జనార్ధన్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ నెల 5న జరిగిన పరీక్ష పేపర్ లీకేజీపై కమిషన్ చర్చిస్తోంది. ఏఈ పరీక్ష రద్దు చేసే యోచనలో కమిషన్ ఉన్నట్లు తెలుస్తోంది. గ్రూప్ వన్ పరీక్షపై వస్తున్న అనుమానాలను కమిషన్ పరిశీలిస్తోంది. ప్రవీణ్ ఎగ్జామ్ సమయంలో వ్యవహరించిన తీరు, అతడి పేపర్‌పై చర్చ కొనసాగు తోంది. ఇప్పటికే రాష్ట్రంలో ఉద్యోగ అభ్యర్థుల ఆందోళనలు ఉధృతమైన నేపథ్యంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది. మరోవైపు పరీక్షా పేపర్ లీకేజీల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయ్యింది. లీకేజీపై ప్రభుత్వం వివరణ కోరింది. కమిషన్ సమావేశం అనంతరం మీడియా ప్రకటన విడుదలకు అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టీఎస్‌పీఎస్సీ సమావేశం తరువాత సీఎస్‌తో బోర్డ్‌ల




సమావేశం జరుగనుంది. మరోవైపు ఈరోజు ఉదయం బీజేవైఎం నేతలు, యూత్ కాంగ్రెస్ నేతల ఆందోళనలతో టీఎస్‌పీఎస్సీ కార్యాలయం దగ్గర తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. బీజేవైఎం కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు టీఎస్‌పీఎస్సీ కార్యాలయ ముట్టడికి యత్నించారు. ఎగ్జామ్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ బీజేపీ శ్రేణులు భారీ ఆందోళనకు దిగాయి. టీఎస్‌పీఎస్సీ బోర్డును ధ్వంసం చేసేందుకు బీజేవైఎం కార్యకర్తలు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులతో బీజేవైఎం కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే తోపులాట జరిగింది. సిట్టింగ్ జడ్జితో విచారణకు బీజేవైఎం డిమాండ్ చేసింది. మరోవైపు యూత్ కాంగ్రెస్ కూడా టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ముట్టడికి యత్నించింది. కార్యాలయం లోపలకు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు వెళ్ళేందుకు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. అటు ఉస్మానియా యూనివర్సిటీ లోనూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజపై ఓయూ బహుజన విద్యార్థి సంఘాలు రాస్తారోకో నిర్వహించాయి. ఓయూ రెడ్డుపై విద్యార్థులు బైఠాయించి ఆందోళన చేయడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. నిరుద్యోగ విద్యార్థులతో చెలగాటం ఆడిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ఓయూ విద్యార్థులు డిమాండ్ చేశారు. గ్రూప్ 1 ప్రీమిమ్స్ పేపర్ ప్రవీణ్ రాసినందున... ఆ పేపర్ కూడా లీక్ అయినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టీఎస్‌పీఎస్సీలో పేపర్ లీక్ చేసిన ప్రవీణ్ గ్రూప్-1 రాయగా 103 మార్కులు వచ్చినట్టు సమాచారం. ఈ క్రమంలో గ్రూప్ -1 పేపర్ కూడా లీక్ అయినట్టు నిరుద్యోగుల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఏఈ పేపర్ లీక్ చేసిన ప్రవీణ్‌పై మరిన్ని అభియోగాలు వచ్చిపడుతు న్నాయి. ఇంకెన్ని పేపర్లు లీక్ చేశాడో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కమిషన్‌తో పని చేస్తూనే ప్రవీణ్ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రాశాడు. గతేడాది అక్టోబర్ 16న గ్రూప్-1 ప్రిలిమ్స్ ఎగ్జామ్ జరిగాయి. అయితే రాంగ్ బబ్లింగ్ కారణంగా డిస్‌క్వాలిఫై అయ్యాడని కమిషన్ వర్గాలు చెబుతున్నాయి. కాగా... ప్రిలిమినరీ కీ తో ఓఎమ్మార్ షీట్ చెక్ చేసినప్పుడు ప్రవీణ్‌కు 103 మార్కులు వచ్చాయని ప్రచారం జరిగింది. తాను రాసిన పరీక్ష పేపర్లు కూడా లీక్ చేసి ఉంటాడని అనుమానాలు వెల్లువెత్తున్నాయి. దీనిపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ప్రవీణ్ ఫోన్, ల్యాప్ టాప్ డాటా ఆధారంగానే లీకేజీలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మరోవైపు లీకేజీకి కారకుడైన ప్రవీణ్‌పై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వేటు వేసింది. ప్రవీణ్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే మరో ఉద్యోగి రాజశేఖర్‌ను కూడా ఉద్యోగం నుంచి తొలగించినట్లు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. పేపర్ లీకేజీలో ఈ ఇద్దరు ఉద్యోగులు కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో టీఎస్పీఎస్సీలో పేపర్ లీకేజీ వ్యవహారం దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీఎస్పీ ఎస్సీ చైర్మన్ జనార్ధన్ రెడ్డి రాజీనామా చేయాలని స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సంజయ్, ఓయూ జేఏసీ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీపై ఓయూ బహుజన విద్యార్థి సంఘాల నాయకులు ఓయూలో రాస్తారోకో నిర్వహించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను అరెస్టు చేసి ఓయూ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పేపర్ లీకేజీ ప్రధాన సూత్రధారణ ప్రవీణ్ ను అరెస్టు చేసి అతన్ని విచారించాలని డిమాండ్ చేశారు, ప్రవీణ్ విచారిస్తే ఆయన వెనుక ఉన్న బీఆర్ఎస్ నేతలు బయటకు వస్తారని ఈ సందర్భంగా విద్యార్థులు తెలిపారు. పేపర్ లీకేజీపై చైర్మన్ జనార్ధన్ రెడ్డి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.తాజాగా ఈ వ్యవహారంపై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు.

లీకుల వ్యవహారం ఎన్నో మలుపులు తీరుగుతున్నది. గ్రూప్1 ప్రిలిమ్స్ కూడా లీకై ఉండొచ్చొన్న వదంతులు వస్తున్నాయి.. అయినా రాష్ట్ర ప్రభుత్వం యథావిధిగా మౌనంగా ఉందన్నారు. లక్షలాది మంది నిరుద్యోగుల కోసం పోరాడుతున్న బీఎస్పీ కార్యకర్తలను మాత్రం పోలీసులు అరెస్టు చేస్తున్నారు. కేసీఆర్ ఎక్కడ' అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

# పెద్దనోట్ల రద్దు అట్టర్ ప్లాప్

**మొదటి పేజీ తరువాయి..**

పెరిగినట్లు తెలుస్తుందని హరీశ్‌రావు తెలిపారు. బీజేపీ పాలనలో మాదకద్రవ్యాల రవాణా టెర్రరిజంపెరిగిపోయింది. కేంద్రం చెప్పిన డీమానిటైజేషన్ లక్ష్యాలు ఒక్కటి కూడా నెరవేరలేదు. బీఆర్ఎస్ ఎల్పీ భవన్‌లో మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. పెద్దనోట్ల రద్దు విఫలమని కేంద్రమే ఒప్పుకుందని మంత్రి గుర్తు చేశారు. పెద్ద నోట్ల రద్దుపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడరు..? చలామణిలో ఉన్న నగదుపై కేంద్రం చెప్పేవి అన్ని అబద్ధాలే అని పేర్కొన్నారు. దొంగనోట్ల సంఖ్య 54 శాతం పెరిగినట్లు ఆర్‌బీఐనే చెప్పిందని తెలిపారు. బీజేపీ అధికారంలోకి రాకముందు ప్రజలు వాడే నగదు తక్కువ. ప్రస్తుతం చలామణిలో ఉన్న నగదు రెట్టింపు అయింది. 2014కు ముందు దేశ జీడీపీలో 11 శాతం నగదు ఉండేది. ప్రస్తుత దేశ జీడీపీలో 13 శాతానికి పైగా నగదు చలామణిలో ఉంది. పెద్ద నోట్ల వాడకం పరిమితం కాలేదు.. రెట్టింపు అయిందని పేర్కొన్నారు. ప్రధాని చెప్పిన 5 ట్రిలియన్ ఎకానమీ ఒక జోక్. పెద్ద నోట్ల మార్పు కోసం క్యూలైన్‌లో నిలబడి 108 మంది చనిపోయారు. పెద్ద నోట్ల రద్దు వల్ల 62 లక్షల మంది ఉపాధి కోల్పోయారు. బీజేపీ తొమ్మిదేండ్ల పాలనలో వంద లక్షల కోట్లు అప్పు చేసింది. దేశంలో అవినీతి, ఆకలి పెరిగిపోతోంది. బీజేపీ అధికారంలోకి వచ్చాక ధరలు మూడింతలు పెరిగాయని మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# సమస్యలపై కదం తొక్కిన మహా రైతులు

**మొదటిపేజీ తరువాయి..**

రైతులు ముందుకు కదిలారు. ఈ ర్యాలీలో ఎక్కడ చూసినా ఎర్ర జెండాలు, ఎర్ర టోపీలు, ఎర్ర కండువాలే దర్శనమిచ్చాయి. రాష్ట్రంలో రైతులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నామని, ఆ సమస్యలన్నింటి పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించేలా చేయడం కోసమే తాము ఈ ర్యాలీ చేపట్టామని రైతు సంఘాల నాయకులు తెలిపారు. వేలమంది రైతులు చీమల్లా బారులుతీరి తరలివెళ్తున్న దృశ్యాలను చూస్తే రైతులు భారీగా తరలి వచ్చారు.

# కొత్తరకం సైబర్ మోసం

**మొదటి పేజీ తరువాయి..**

చేసుకుంటున్నారు. తాజాగా మరొక సైబర్ స్కామ్ తెరమీదకు వచ్చింది. యూట్యూబ్ లో లైక్ కొడితే చాలు.. ఒక్కో లైక్ కు రూ.50 ఇస్తామని నమ్మించారు. ఇన్వెస్ట్ మెంట్ పేరుతో ఆరుగురు వ్యక్తులనుంచి దాదాపు రూ.75 లక్షలు మేర లూటీ చేశారు. విషయం తెలుసుకున్న బాదితులు మోసపోయామని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. భరత్ నగర్ కు చెందిన ఓ యువకుడికి పార్ట్ టైం జాబ్ ఉందంటూ వాట్సాప్ లో మెసేజ్ వచ్చింది. ఇంట్లో కూర్చొని పార్ట్ టైం జాబ్ చేస్తూ సంపాదిచొచ్చు అనుకున్న ఆ యువకుడు.. తనకు మెసేజ్ వచ్చిన వాట్సాప్ నెంబర్ కు కాల్ చేసి మాట్లాడాడు. ఉద్యోగం వచ్చే వరకు వాళ్లు పంపించే యూట్యూబ్ వీడియోలకు లైక్స్ కొట్టాలని.. ఒక్కో లైక్ కు రూ.50 ఇస్తామని నమ్మించారు. కొద్ది రోజుల వరకు లైక్ కు రూ.50 చొప్పున చెల్లిస్తూ వచ్చారు. ఆ తర్వాత మొదలయింది.. అసలు కథ. పార్ట్ టైం జాబ్‌లో ఇన్వెస్ట్ మెంట్ చేయాలంటూ.. దశలవారీగా రూ. 25 లక్షలు చెల్లించుకున్నారు. ఆ డబ్బంతా తీసుకొని ఉడాయించారు. ఇలానే బతుకు దెరువు కోసం సిటీకి వచ్చిన ఓ రైతుకు ఇలానే జరిగింది. పార్ట్ టైం జాబ్, ఇన్వెస్ట్ మెంట్ పేరుతో అతని దగ్గర కూడా రూ. 25 లక్షలు కాజేశారు. షేక్ పేట్ వ్యక్తి దగ్గర రూ. 9 లక్షలు, యూసఫ్ గుడ వాసి దగ్గర రూ.10 లక్షలు... ఇలా చాలామంది దగ్గర మాయ మాటలు చెప్పి డబ్బు తీసుకొని బోర్డు తిప్పేశారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందుకున్న సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉభయ సభల్లో మళ్లీ గందరగోళం

**మొదటిపేజీ తరువాయి..**

పార్టీలు డిమాండ్ చేశాయి. భారత రాష్ట్ర సమితితో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ పాలనలో న్యాయశాస్త్ర నియమాలను తుంగలో తొక్కారని, ప్రజాస్వామ్యం కూనీ అవుతుందని ఆయన మండిపడ్డారు. అదానీ అంశంపై ప్రతిపక్షాల ఆందోళనలతో ఉభయసభలు మధ్యాహ్నానికి వాయిదా పడిన అనంతరం ఖర్గే పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం దేశాన్ని నియంతృత్వ ధోరణితో నడిపిస్తోందని, పైగా ప్రభుత్వ పెద్దలు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటారని ఖర్గే ఎద్దేవా చేశారు. అదానీ కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) కోసం తాము డిమాండ్ చేస్తున్నామని, అయితే తాము ఆ అంశాన్ని లేవనెత్తినప్పుడల్లా మైకులు కట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీంతో సభలో గందరగోళం నెలకొందంటూ సభను వాయిదా వేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలో అధికారాన్ని అడ్డంపెట్టుకొని దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న బీజేపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ.. పార్లమెంట్ ఆవరణలో బీఆర్ఎస్ ఎంపీలు ఆందోళన నిర్వహించారు. ఇడీ, సీబీఐ మరియు ఐటీలను కేంద్రం దుర్వినియోగం చేస్తూ.. విపక్షాల మీద కక్ష సాధింపు రాజకీయాలను చేస్తోందని, రాష్ట్రల్లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను పడదోస్తూ.. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తుందని బీఆర్ఎస్ ఎంపీలు, విపక్ష సభ్యులు పార్లమెంట్‌లో ఆందోళనకు దిగారు. ఈ అంశంపై తక్షణం చర్చ నిర్వహించాలని వాయిదా తీర్మానం ఇచ్చారు.ఉభయ సభలు వాయిదాపడటంతో.. పార్లమెంట్ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహం వద్దకు చేరిన బీఆర్ఎస్ ఎంపీలు అక్కడే ధర్నా నిర్వహించారు.

## మంత్రి కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

### సన్నాహక సమావేశంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

### ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

**భీమదేవరపల్లి మార్చి 14 (ప్రజామంటలు):** మండలం ముల్కనూరు గ్రామంలో ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ఈ నెల 20 వ, తేదీన హుస్నాబాద్ డిపో గ్రౌండ్ లో జరిగే కేటీఆర్ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హుస్నాబాద్ నియోజకవర్గంలో జరిగే పని అభివృద్ధి పనులకు



గాను విచ్చేస్తున్న మంత్రి కేటీఆర్ సభను దిగ్విజయం చేసే బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉందన్నారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం మండలానికి చెందిన 13 లబ్దిదారులకు 4 లక్షల 38 వేల 500 రూపాయల విలువగల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను హుస్నాబాద్ ఎమ్మెల్యే శ్రీ వొడితల సతీష్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్, జెడ్పిటిసి వంగ రవి, ఎంపీపీ జక్కుల అనిత రమేష్ యాదవ్, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు మార్పాటి మహేందర్ రెడ్డి, ఎంపిటీసీల ఫోరం అధ్యక్షులు మండల సురేందర్, బీఆర్ఎస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**జనగామ మార్చి 14 (ప్రజామంటలు):** జనగామ జిల్లా మరిగడి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ



సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులు రేణుకుంట్ల మురళి మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, సృజనాత్మకత పెరుగుతుందని చెప్పారు. డిఈఓ గా మనుదీప్, ఎంఈఓ గా రాజేందర్, హెచ్ఎం గా మనోజ్ కుమార్, పిఈటి గా అరుణ్ కుమార్ ఉపాధ్యాయులుగా కె. శ్రావణి, రేఖ, కీర్తన, బి. శ్రావణి, రితీష్, భాను శ్రీ, సాత్విక్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్టీఫెన్, సాంబరాజు, సురేష్, ఉమాదేవి పాల్గొన్నారు.



భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన అన్నవరపు కృష్ణమూర్తి భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, 1973 లో జన్ సంఘ్ పార్టీ భీమదేవరపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. వారి మృతి పట్ల బిజెపి నాయకులు దొంగల కొమురయ్య రిటైర్డ్ టీచర్ గొల్లపల్లి లక్ష్మయ్య సంతాపం వెలిబుచ్చారు.

## అంజలి గ్రూప్ ఫౌండేషన్ మహిళా కో ఆర్డినేటర్‌గా వనిత

### సాంస్కృతిక కో ఆర్డినేటర్ గా రామచంద్రం





**జగిత్యాల మార్చి 14 (ప్రజామంటలు):** అంజలి గ్రూఫ్ ఫౌండేషన్ జగిత్యాల డివిజన్ మహిళా కో ఆర్డినేటర్ గా జగిత్యాల కు చెందిన సామాజిక సేవకురాలు బొద్దు వనితను అలాగే సామాజిక సేవకులు, ఆధ్యాత్మిక వేత్త తవుటు రామచంద్రంను సాంస్కృతిక జగిత్యాల డివిజన్ కో ఆర్డినేటర్ గా నియమించామని గ్రూప్ ఫౌండర్ కామిశెట్టి రాజు పటేల్ తెలిపారు. ఈమేరకు రాజు పటేల్ మంగళవారం నియామకం చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేశారు. గతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి గ్రామాల అభివృద్ధి,సమాజ హితం కోసం ఆవిర్భవించిన అంజలి గ్రూప్ ఫౌండేషన్ జగిత్యాల డివిజన్ లోని అన్ని మండలాల్లో, గ్రామాల్లో కమిటీల నిర్మాణం చేయవలసిందిగా మహిళా విభాగం రాష్ట్ర కో ఆర్డినేటర్ కొండపల్లి దీపిక, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రాపెల్లి కుమార్, జగిత్యాల జిల్లా కో ఆర్డినేటర్ ఎన్నం కిషన్ రెడ్డి లు కోరారు. వనిత, రామచంద్రంల నియామకం పట్ల మహిళా జిల్లా కో ఆర్డినేటర్ నమిలకొండ సాకేతా, కళాశ్రీ గుండేటి రాజు, కటకం గణేష్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎల్ హెచ్ పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజ్మీర స్వామి నాయక్, జిల్లా అధ్యక్షులు లకవత్ నరేష్ నాయక్, ఠాగూర్ నాయక్. ప్రభుత్వపరంగా వచ్చే సంక్షేమ ఫలాలను జనగామ జిల్లాకు కేటాయించాలని గిరిజనులకు న్యాయం చేయాలని, మైదాన ప్రాంతంలో గిరిజనులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి.

# పంట పొలాలకు నీరు విడుదల చేయాలి

- **ఎండుతున్న పంట పొలాలను సందర్శించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

**సారంగాపూర్ మార్చి 14 (ప్రజామంటలు):** అధికారుల నిర్లక్ష్యంతోనే పంట పొలాలు ఎండుతున్నాయి. నీరు అందుబాటులో ఉన్నా నీరు ఇవ్వాలేని దుస్థితికి అధికారుల నిర్లక్ష్యమే కారణం అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. నీరందక రైతుల పంటలు ఎండుతున్నాయని అధికారులు తక్షణమే నీరు విడుదల చేసి పంట పొలాలను కాపాడాలనీ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. సారంగాపూర్ మండలం బట్టపల్లి పోతారంలో ఎండుతున్న పంట పొలాలను పట్టభద్రులు ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కాలువలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ప్రాజెక్టులో నీళ్లున్న పంట పొలాలకు నీరు ఇవ్వడంలేదని రైతులు జీవన్ రెడ్డి ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.... పొలాలకు సరిపడా నీరు అందుబాటులో ఉండి కూడా నీరంది ఒక పోవడంతో వందలాది ఎకరాలు ఎండిపోతున్నాయి. పోసాని కుంట నుండి గత నెల రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో భూగర్భ జలమట్టం తగ్గిపోయింది. కాలువతో నీరందని పరిస్థితి నెలకొంది. ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో పంటలకు నీరు అందని పరిస్థితి నెలకొంది. సారంగాపూర్ బీర్పూర్ మండలాలకు 75 క్యూసెక్కుల నీరు కోత పెడుతూ అవసరం లేని చోట అదనంగా నీరు అందిస్తున్నారని ఆరోపించారు. సహజంగా నీరు అందుబాటులో లేనప్పుడు ఆన్ లైన్ ఆఫ్ విధానం అమలు చేస్తారు. ప్రాజెక్టులు నీరు అందుబాటులో ఉన్నప్పుడు కూడా ఆన్ అండ్ ఆఫ్ విధానం అమలు చేయడం ఏమిటని విస్మయం వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా మొత్తం ఎస్సారెస్పీ ప్రాజెక్టు పైనే ఆధారపడి ఉందన్నారు. అతివృష్టితో రోళ్ళవాగు ప్రాజెక్టు తెగిపోవడంతో పునరుద్ధరణలో జాప్యం జరిగిందనీ అన్నారు. 175 క్యూసెక్కులు నీరు అవసరమైన చోట 250 క్యూసెక్కుల నీరు ఇస్తుండడంతో నీటి కొరత ఏర్పడిందని జీవన్ రెడ్డి అన్నారు. వరద కాలువ ఎస్సారెస్పీ లింకు కెనాల్ ద్వారా నీరు విడుదల చేయ అవకాశం ఉన్న నీరు ఇవ్వడంలేదని విమర్శించారు. డి 70



నుండి డి 90 వరకు 2.50 లక్షల ఎకరాలు, పెద్దపల్లి లో 3 లక్షల ఎకరాలకు నీరు అందే అవకాశం ఉంది. సీఎం కేసీఆర్ ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతం మహారాష్ట్రలో నీరు ఎత్తిపోస్తామంటూ గొప్పలు చెబుతున్నారని, తెలంగాణ రాష్ట్రంలో నీరు ఉన్నా అందించే సమర్థత కనబడడం లేదని ఎద్దేవా చేశారు. ఏ హక్కు లేని మహారాష్ట్ర కు నీళ్లు ఇస్తామంటున్నారని, అన్ని హక్కులు ఉన్న తెలంగాణ బిడ్డల పంట పొలాలకు నీళ్లు ఇవ్వరా అని ప్రశ్నించారు. ఎస్సారెస్పీ ఆయకట్టు కాలువల నిర్వహణ చేపట్టకపోవడంతో ఆయకట్టు చివరి రైతులకు నీరు అందని పరిస్థితి నెలకొంది. రైతులు చేపట్టే ఆందోళన కార్యక్రమానికి ఇంజనీరింగ్ అధికారులకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వెంటనే నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఈ సుధాకర్ రెడ్డితో ఫోన్లో మాట్లాడగా, డిఈఈ పంట పొలాలను సందర్శించి రేపటిలోగా నీళ్ల అందిస్తామని హామీ ఇచ్చారని జీవన్ రెడ్డి అన్నారు.

## కాంగ్రెస్ పార్టీ తోనే ప్రజా సంక్షేమ పాలన సాధ్యం

- **గడప గడపకు రాహుల్ గాంధీ పాదయాత్ర సందేశ కర్రపత్రాలు**

**జనగామ మార్చి 14 (ప్రజామంటలు):** టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకు జనగామ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 23వ వార్డులో హాత్ సే హాత్ జోడో యాత్రను గడప గడప కు రాహుల్ గాంధీ పాదయాత్ర సందేశ కర్రపత్రాలు అందించారు. అనంతరం జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసాన్ పల్లి లింగాజి, జనగామ జిల్లా నాయకులు ఉడత రవి యాదవ్, జనగామ పట్టణ నాయకులు జయ మల్లేశం, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కీసర దిలీప్ రెడ్డి మాట్లాడారు. హాత్ సే హాత్ జోడో అభియాన్ పాదయాత్రలో పాల్గొన్న జనగామ పట్టణంలోని 23వ వార్డు లో ఇంటింటికి రాహుల్ గాంధీ సందేశాన్ని కరపత్రాల ద్వారా పంపిణీ చేశారు. రాహుల్ గాంధీ సుధీర్ఘ పాదయాత్ర సందేశాన్ని, బిజెపి, టిఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెడుతూ చేస్తున్న మోసాలను కరపత్రం రూపంలో గడప గడపకు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ పట్టణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మోటే శ్రీనివాస్, జనగామ జిల్లా నాయకులు రంగు రవి, జనగామ పట్టణ యూత్ కాంగ్రెస్



అధ్యక్షులు యండి మాజిద్, మహేశ్వరం శ్రీనివాస్, మైనార్టీ సెల్ నాయకులు జఫర్ షరీఫ్, నోముల రాజు, పాము నర్సింగరావు, జనగామ నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ యండి ఫయాజ్, యూత్ కాంగ్రెస్ నాయకులు సౌడ మహేష్, యండి ఫజల్, రెహమాన్, ఎం.ఎ అజిజ్, యండి అరిఫ్, ఉద్దీన్ యండి అఫ్జల్, మడూరు రాజు పాల్గొన్నారు.

## పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల అమరత్వం చిరస్మరణీయం

**చిగురుమామిడి మార్చి 14 (ప్రజామంటలు):** భూస్వాముల, పెత్తందార్ల ఆగడాలను ఎదిరించడానికి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన త్యాగమూర్తుల అమరత్వం చిరస్మరణీయమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ శాసనసభ్యులు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు అనభేరి ప్రభాకర్ రావు 75వ వర్ధంతి సందర్భంగా మంగళవారం సీపీఐ చిగురుమామిడి మండల సమితి ఆధ్వర్యంలో సుందరగిరి నుండి హుస్నాబాద్, మహ్మదాపూర్ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ.... భూమి కోసం, భుక్తి కోసం, పేద, బడుగు బలహీన వర్గాల కోసం పెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన వీరోచిత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 1948 మార్చి 14న మహమ్మదాపూర్ గుట్టల్లో అమరవీరులైన అన్నభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి మరో పదిమంది అమరవీరులు నిజాం రజాకార్ పోలీస్ మూకల తొలి ఎన్ కౌంటర్ కాల్పుల్లో నేలకొరిగారని, అమరవీరులైన వారంతా ఉన్నత కుటుంబాల్లో పుట్టి పేదల కోసం పని చేశారని వారి పోరాట స్ఫూర్తిని అందుకొని వారి ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లేందుకు నేటి తరం కమ్యూనిస్టు శ్రేణులు ప్రజల కోసం పనిచేయాలని చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ బైక్ ర్యాలీలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ జడ్పీటీసీ



అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు గూడెం లక్ష్మీ, అందె చిన్న స్వామి, జీల సంపత్, ఇల్లందుల రాజయ్య, బూడిద సదాశివ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బోయిని పటేల్, మండల కన్వీనర్ కాంతాల శ్రీనివాస రెడ్డి, శాఖ కార్యదర్శులు ఎం.డి. ఉస్మాన్ పాషా, గందే కొమురయ్య, మంద ఎల్లయ్య, పైడిపెల్లి వెంకటేష్, మామిడి సంపత్, అనుమండ్ల మల్లారెడ్డి, బోట్ల పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాటసారుల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

**చిగురుమామిడి మార్చి 14 ( ప్రజా మంటలు):** మండలంలోని సుందరగిరిలో జె ఎస్ ఆర్ చలివేంద్రం ను గ్రామస్తులతో కలిసి ప్రారంభం చేసిన బిజెపి మండల అధ్యక్షులు దుద్దేల లక్ష్మీనారాయణ బిజెపి హుస్నాబాద్ నియోజవర్గ నాయకులు వృక్ష ప్రదాత జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఏడు మండల కేంద్రాలతో పాటు జనసంచార%శీ% ఎక్కువగా ఉన్న కూడల్లో సైతం చల్లటి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని రెండు సంవత్సరాలుగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు వాటర్ కూల్ ఫ్రిజ్ తో కూడిన చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలోని చిగురుమామిడి సుందరగిరి చిన్నమల్కనూర్ గ్రామాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం పట్ల బాటసారిలు జన్నపు రెడ్డి సురేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేస్తూ అభినందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు దుద్దేల లక్ష్మి నారాయణ, ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి శ్రీనివాస్, బీజేపీ జిల్లా లీగల్ సెల్ కో కన్వీనర్ బాకము సంపత్, సుందరగిరి శక్తీ కేంద్ర ఇంఛార్జి, బీజేపీ సీనియర్




నాయకులు వంగర మల్లేశం, సోషల్ మీడియా కన్వీనర్ బోయిని ప్రశాంత్, మైనార్టీ మోర్చ అధ్యక్షులు సయ్యద్ షరీఫ్, బూత్ అధ్యక్షులు తులైలా వెంకన్న, రెడ్డి శ్రీనివాస్, కసావేని రమేష్, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు క్యాంపును తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

**జనగామ మార్చి 14 (ప్రజామంటలు):** జనగామ పట్టణం 16 వార్డు లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు క్యాంపును మున్సిపల్ కమిషనర్ రజిత తో కలిసి మంగళవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఇప్పటికే జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతుందని ఇంకా పట్టణ పరిధిలో కంటి వెలుగు పరీక్షలకు హాజరుకాని వారిని గుర్తించి వారికి సమాచారం అందించి పరీక్షలను సద్వినియోగం చేసుకునేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని, క్యాంపులో పాల్గొన్న వారితో మాట్లాడుతూ అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్యాంపులకు హాజరయ్యే వారి కోసం ఎండల తీవ్రత దృశ్య టెంట్లు, కుర్చీలు, త్రాగునీరు, తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.



## నిట్ (వరంగల్ )లో అంతర్జాతీయ గణిత దినోత్సవ వేడుకలు

**హన్మకొండ మార్చి 14 ( ప్రజామంటలు):** జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (నిట్ వరంగల్ ) లో అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని జరుపుకున్నారు. లాల్ బహదూర్ కళాశాల, ఆర్ట్స్ %డ% సైన్స్ కళాశాల మరియు పింగిళి కళాశాల వంటి సమీపంలోని డిగ్రీ




కళాశాలల కోసం మాస్టర్స్ జాయింట్ అడ్మిషన్ టెస్ట్ (జేఏఎమ్) గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 200 మంది విద్యార్థులు తమ అధ్యాపకులతో పాటు హాజరయ్యారు. డైరెక్టర్ ప్రొఫెసర్ బి.వి. రమణారావు తో పాటు గణితం ప్రొ. హెచ్.పి. రాణి, కెమిస్ట్రీ ప్రొ. కాశీనాథ్, ఫిజిక్స్ ప్రొ. వెంకటప్ప రావు విభాగాధిపతులు ఎన్ఐటి వరంగల్‌లో 'పై డే' మరియు పిజి కోర్సుల ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రొఫెసర్ డి. శ్రీనివాసాచార్య మరియు ప్రొఫెసర్ కాశీ విశ్వనాధం జామ్ దరఖాస్తు ప్రక్రియపై వివరణాత్మక విశ్లేషణ చేశారు. ఈ కార్యక్రమంలో నిట్ అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఇన్‌స్టిట్యూట్ పూర్వ విద్యార్థులు, రిటైర్డ్ ప్రొ. శ్రీ నగేష్, ప్రధాన శాస్త్రవేత్త, ఎన్‌జిఆర్ఐ, హైదరాబాద్ మరియు ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ "సీస్మోలజీలో గణితశాస్త్రం యొక్క పాత్ర" అనే అంశంపై ప్రసంగించారు.

## నర్సింగాపూర్ జడ్పీ హైస్కూల్ లో విద్యార్థులకు అబాకస్‌పై శిక్షణ

**జగిత్యాల రూరల్ మార్చి 14 (ప్రజామంటలు):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జగిత్యాల మండలం నర్సింగాపూర్ యందు విద్యార్థులకు వేగంగా గణితం చేయుట గణితం అంటే భయం లేకుండా అనే కార్యక్రమం చేపట్టి అబాకస్ నిపుణుడు అడ్లగట్ట గంగాధర్ చే విద్యార్థులకు సులభంగా గణితం చేసే పద్ధతులపై శిక్షణను



అందజేసారు. అయితే ఇట్టి కార్యక్రమంలో విద్యార్థులు ఆడుతూ పాడుతూ గణిత శిక్షణ కార్యక్రమాన్ని సులభ పద్ధతిలో నేర్చుకున్నారు. పెన్, పెన్సిల్, పేపర్ లేకుండా విద్యార్థులు చేతివేళ్లపై అలవోకగా గణిత సమస్యలను సాధించినారు. ముగింపు కార్యక్రమానికి నర్సింగాపూర్ గ్రామ సర్పంచ్ గడ్డం సరోజ మల్లారెడ్డి మరియు ఎంపీటీసీ మంగళారపు మహేష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందునేరి రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు స్వప్న ప్రియ, శ్రీనివాస్, అరుణ, గంగ మోహన్, విలాసిని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి కుమార్, తదితరులు హాజరైనారు. ముగింపు సమావేశానికి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ తూకుంట్ల అమిత్ కుమార్, శ్రీ సత్య సాయి అన్నపూర్ణ ట్రస్ట్ జగిత్యాల జిల్లా కన్వీనర్ ఉటూరి శ్రీకాంత్, టీఎస్ టి యు జిల్లా అధ్యక్షుడు పి. కొమురయ్య హాజరైనారు. వీరు మాట్లాడుతూ.... ఉదయం 10 నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించిన అబాకస్ వర్క్ షాప్ విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.



మహిళా దినోత్సవం సందర్భంగా హైదారాబాద్‌లో జాతీయ చేనేత ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చిందం సునీత ను జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు తార ఘనంగా సన్మానించారు.



చెన్నైలోని తెలుగు వెలుగు సంక్షేమ సంఘం వారిచే ఉగాది పురస్కారాలలో భాగంగా బాల సాహిత్యం లో ధర్మపురికి చెందిన సంగనభట్ల చైనా రామకిష్టయ్య కు "తెలుగు వెలుగు" బిరుదు ప్రదానం చేసి, సత్కరించారు.



భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయ చైర్మన్ మాడిశెట్టి కుమారస్వామి తండ్రి కిష్టయ్య ఇటీవలే అనారోగ్యంతో చనిపోగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్. జడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, జెడ్పిటిసి వంగ రవి, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు మారుపాటి మహేందర్ రెడ్డి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గూడెల్లి రాజిరెడ్డి

# 20 నుంచి బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశాలు

### సనత్‌నగర్ నియోజకవర్గం నేతలో మంత్రి తలసాని సమీక్ష

హైదరాబాద్,మార్చి14(ప్రజామంటలు): ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఈనెల 20 నుంచి బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశాలను నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. మంగళవారం సనత్‌నగర్ నియోజకవర్గం కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులతో మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 20వ తేదీన మోండామార్కెట్, 23న రాంగోపాల్‌పేట్, 25న బేగంపేట్, 27న అమీర్‌పేట్, 29న సనత్‌నగర్, ఏప్రిల్ 2న బన్సీలాల్‌పేట్ డివిజన్‌లలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ పాలనలో సంక్షేమ పథకాల అమలులో దేశానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఆర్థికంగా ఎంతో వెనకబడిన దళితులు అభివృద్ధి చెందాలనే సదుద్దేశ్యంతో దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత బంధు ను చేపట్టి అర్హులైన నిరుపేద దళితులకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గానికి వంద మందికి అందించగా 2వ విడతలో



నియోజక వర్గానికి 1100 మందికి ఆర్థిక సహాయం అందించనున్నట్టు వెల్లడించారు.

ఆదేవిధంగా సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారికి గృహలక్ష్మి క్రింద రూ. 3 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించే విధంగా ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించినట్టు వివరించారు. దీనికి సంబంధించిన మార్గ దర్శకాలు రానున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్లు మహేశ్వరి, కొలన్ లక్ష్మీబాల్‌రెడ్డి, హేమలత, మాజీ కార్పొరేటర్లు, డివిజన్‌ల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# దళితుల అభ్యున్నతి కోసమే దళితబంధు

### వారు సొంతంగా వ్యాపారం చేసుకునే అవకాశం
### అన్ని వర్గాలకు అండగా ప్రభుత్వ కార్యక్రమాలు
### దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్,మార్చి14 (ప్రజామంటలు): అట్టడుగున ఉన్న దళితులు శాశ్వత ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని అమలు చేస్తున్నారని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం బంగల్ పేట్ లో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమం కొరకు అనేకమైన పథకాలను ప్రవేశపెట్టి నేరుగా ప్రజలు లబ్ధి పొందే విధంగా కృషి చేస్తున్నారని అన్నారు. అదే విధంగా దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే దళితబంధు పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ప్రతి దళిత కుటుంబానికి లబ్ధి చేకూర్చాలన్న సదాశయంతో ప్రభుత్వం దళిత బంధు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. దళితబంధుతో అనేక మంది దళితులు ఆర్థికంగా వృద్ధి సాధించారని, కూలీ నాలీ చేసుకునే రోజులు పోయాయని చెప్పారు. అనేక మంది తమ యూనిట్లను ఏర్పాటు చేసుకుని తమ కుటుంబ సభ్యులకు కూడా ఉపాధి కల్పిస్తున్నారని వెల్లడించారు. నిర్మల్ నియోజకవర్గానికి 11 వందల యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. నిరుపేదలైన 11 వందల కుటుంబాలు ప్రత్యక్షంగా లబ్ధిపొందనున్నాయని, దీంతో ఇన్నేళ్లు ఒకరి దగ్గర పని చేసిన దళితులు తమే యాజమానులుగా మారి ఇంకో నలుగురికి ఉపాధి చూపుతున్నారని వివరించారు. అయితే యూనిట్ల ఎంపిక విషయంలో లబ్దిదారులకే పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, వారికి అనుభవం, ఇష్టం కలిగి ఉన్న రంగాల్లో యూనిట్లను నెలకొల్పేందుకు తోడ్పాటును అందిం



చాలని అధికారులకు సూచించారు. మార్కెట్ స్థితిగతులు, లాభనష్టాల గురించి అన్ని అంశాలను పరిశీలించాకే లబ్ధిదారులు తమకో ఏది లాభదాయకమో ఆలోచించి యూనిట్లను నెలకొల్పాలని చెప్పారు. అన్ని కులాలను గౌరవిస్తూ, ప్రతి ఒక్కరు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు. పేద ప్రజలు వివాహ, ఇతర శుభ కార్యాలు, సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి గ్రామాలు, పట్టణాల్లో బీసీ, ఎస్సీ, మైనార్టీ కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుందని చెప్పారు. తెలంగాణలో రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ ఆశయాలకు అనుగుణంగా దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆయన సేవలకు గుర్తుగా నూతన సచివాలయానికి డాక్టర్. బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టామని గుర్తు చేశారు. అంతేకాకుండా భారతదేశంలోనే



అతిపెద్దదైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామని, ఏప్రిల్ 14న ఆయన విగ్రహాన్ని ప్రారంభించు కుంటున్నామని, ప్రారంభోత్సవ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మరోవైపు మతం, కులం పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాజంలో విభజన తెస్తుందని, బడుగు బలహీన వర్గాలను నిర్లక్ష్యం చేస్తుందని చెప్పారు. దళితుల మీద ప్రేమ ఉంటే నూతనంగా నిర్మించుకున్న పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు ఎందుకు పెట్టరని ప్రశ్నించారు. పార్లమెంట్ అంబేద్కర్ పేరు పెట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# గిరిజన గ్రామాల్లో ఏటా మంచినీటి సమస్యలు

### లక్ష్యం నెరవేర్చని మిషన్ భగీరథ

ఆదిలాబాద్,మార్చి14(ప్రజామంటలు): జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో కలుషిత నీరుతాగి గిరిజనులు ప్రాణాలు కోల్పోతున్నారని భావించిన ప్రభుత్వం గిరిజనులకు శుద్ధజలం అందించడానికి చేపట్టిన పనులు పూర్తికాక పోవడంతో ఏటా వారు కలుషిత నీటికి బలవుతున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలోని కుమ్రం భీంప్రాజెక్టు నుంచి కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), నార్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లోని పలు గిరిజన గ్రామాలకు తాగునీరు అందించాలని భావించారు. గిరిజన గ్రామాలలోని ప్రతీ కుటుంబానికి రక్షిత నీటిని అందించాలని భావించారు.ఇప్పటివ రకు 85శాతం నిధులు ఖర్చు అయినట్లు తెలుస్తున్నా గిరిజన గ్రామాలకు కావాల్సిన మంచినీరు అందించలేకపోయారు. 50 గ్రామాలకు కూడా ఇంకా తాగునీరు అందలేదు. పనులు చేపట్టిన సంస్థ ద్వారా జరిగిన పనుల్లో నాసిరకం పనులు చోటుచేసుకోవడంతో పైపులైన్‌లలో లీకేజీలు ఏర్పడి నీరు




వృధాగా పోతోంది. గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తున్నా పనుల్లో జాప్యం జరుగుతోంది. కెరమెరి ఘాట్ ప్రాంతంలో సైతం లీకేజీలు ఏర్పడినట్లు తెలుసుకున్న అధికారులు వెంటవెంటనే మరమ్మతులు చేయించారు. నార్నూర్ మండలంలోని పూసిగూడ, మాన్కాపూ ర్ వద్ద పైపులైన్లకు లీకేజీలు ఏర్పడడంతో మాన్కాపూర్ వద్ద మరమ్మతులు వేగంగా చేశారు. నార్నూర్ మండలంలోని తాడిహత్నూర్ వరకు వేసిన పైపులైన్‌కు పరీక్షలు చేసినా గిరిజన గ్రామాలకు ఇంకా నీరు అందడం లేదు. ఈ సంవత్సరం అయినా భగీరథ నీరు అందుబాటులోకి వస్తుందో రాదోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతీ ఇంటికి నల్లా ద్వారా నీరందించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మిషన్ భగీరథ కార్యక్రమం జిల్లాలో లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల ప్రజల దాహార్తి తీర్చడానికి కుమరం భీం ప్రాజెక్టు నుంచి కొన్నేళ్లుగా చేపడుతున్న మిషన్ భగీరథ పనులు నేటికీ పూర్తికాలేదు. సకాలంలో పూర్తిచేసి ప్రజలకు నీటి కష్టాలు రాకముందే నీరు అందించాలపి స్థానిక ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

# ప్రజలు బిజెపిని నమ్మడం లేదు

### పార్టీలో చేరిన వారికి తగన గుర్తింపు ఇస్తాం: జీవన్ రెడ్డి

ఆర్మూర్, మార్చి14 (ప్రజామంటలు): అభివృద్ధి, సంక్షేమాలను పలువురు బిఆర్ఎస్‌లో చేరుతున్నానరని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో బిజెపికి స్థానం లేదని, వారి ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలు విసిగి పోయారని అన్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గం మాక్లూర్ మండలానికి చెందిన పలువురు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి నాయకత్వంలో మాల కమిటీ సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాల మహనాడు కమిటీ మాక్లూర్ అధ్యక్షుడు దేగరి రవి, నీరడి గంగాధర్, శశి కుమార్, చింతల మోహన్, సక్కి ప్రభాకర్, వర్ణ బాస్ తదితరులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో చేరిన వారికి తగిన గుర్తింపు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఉన్న విశ్వాసం తోనే అన్ని వర్గాల వారు బీఆర్ ఎస్ లో చేరుతున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై తామంతా బీఆర్ ఎస్ లో చేరుతున్నట్లు మాల మహనాడు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు 'దేశ్ కీ నేత కేసీఆర్, జైజీవనన్న, జై తెలంగాణ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాక్లూర్ మండల ఎంపీపీ మాస్త ప్రభాకర్,నరేందర్, అశోక్, నాగయ్య, శాంసన్, శ్రీనివాస్, మేకల అశోక్, మోహన్, నాగేశ్, వేణు, ఒడడెన్న తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

జనగామ,మార్చి14(ప్రజామంటలు): పదోతరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. రెగ్యులర్ విద్యార్థుల కోసం, సప్లిమెంటరీ విద్యార్థులకు సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఫ్లయింగ్, స్క్వాడ్, డిపార్ట్‌మెంట్ బృందాలు ఏర్పాటు చేశారు.పరీక్ష ప్రారంభానికి అరగంట ముందుగానే కేంద్రంలోకి అనుమతిస్తారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో తాగునీరు, ప్రత్యేక వైద్య సదుపాయం, రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి ప్రత్యేకంగా ప్రతీ కేంద్రానికి సిట్టింగ్ స్క్వాడ్‌గా నియమిస్తున్నారు. పరీక్షలను పరిశీలించేందుకు రాష్ట్రస్థాయి నుంచి జిల్లా పరిశీలకులుగా ఒకరు ఉంటారు. ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానాన్ని దక్కించు కునేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రత్యేక శ్రద్ధతీసుకొని ప్రత్యేక తరగతుల నిర్వహణ, బోధనా విధానంలో మార్పులు తేవడంతో ఈసారి మెరుగైన ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు.

# ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా లేని సౌకర్యాలు

### గైనకాలజిస్టుల పోస్టులు ఖాళీల భర్తీలో నిర్లక్ష్యం
### గర్భిణుల అవస్థలు పట్టించుకోని అధికారులు

ఆదిలాబాద్,మార్చి14(ప్రజామంటలు): జిల్లాలోని పలు ప్రభుత్వాసు పత్రిల్లో సౌకర్యాల లేమి రోగులకు శాపంగా మారింది. ఆసు పత్రిలో రోగులకు కావాల్సిన వైద్య సేవలు అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వాసుపత్రి నిర్వహణ నానాటికి అధ్వానంగా మారుతుండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రభుత్వాసుత్రిలో స్త్రీవైద్య నిపుణురాలు లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. మహిళా వైద్యులను తక్షణంనియమించాలని కోరుతు న్నారు. ప్రధానంగా పలు ఆస్పత్రుల్లో గైనకాలజిస్టులను ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి హరీస్ రావు పదేపదే చెబుతున్నా క్షేత్రస్థాయిలో అవేమీ కనిపించడం లేదు. ప్రభు త్వాసుపత్రిలోనే ప్రసవం చేయించుకోవడం తల్లికి బిడ్డకు శ్రేయష్కరమని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ఆచరణకు నోచుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో డెలివరిలను ప్రోత్సహించి తద్వారా తల్లుల కడుపు కోతకు స్వస్తి చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలులోకి తెచ్చింది. అందులో భాగంగానే ప్రభుత్వాసుపత్రుల్లో గర్భిణులు ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని అనం తరం ప్రభుత్వాసుపత్రుల్లోనే సాధారణ కాన్పులు చేయించు కునేలా ప్రోత్సహించేందుకు నగదు ప్రోత్సాహకం, కేసిఆర్‌కిట్ లాంటి పథకాలు ప్రవేశపెట్టింది.

ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలు కల్పించలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్, మామడ మండలాల్లో చుట్టు పక్క గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక పెద్దాసుపత్రిగా పేరుగాంచిన ఖానాపూర్ ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాల లేమితో ఏ చిన్న సమస్య వచ్చిన ప్రైవేటు ఆసుపత్రులను ఆ శ్రయించక తప్పని పరిస్థితి నెలకొందని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్న 50 పడకల ఆసుపత్రిలోనే సౌకర్యాల లేమి వెక్కిరిస్తోందని ఇక ఏరియా ఆసుపత్రిగా మారితేనైనా పరిస్థితిలో మార్పు వస్తుందేమోనని అందరూ

# కేబుల్ బ్రిడ్జిపై పార్కింగ్ చేస్తే...జరిమానా

హైదరాబాద్,మార్చి14(ప్రజామంటలు): హైదరాబాద్ నగరంలో ఆకర్శణగా నిలిచిన దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్ ను చూసేందుకు చాలామంది వెళ్తుంటారు. దానిపై ఆగి ఫొటోలు దిగుతుంటారు. బర్త్ డే పార్టీలు చేసుకుంటారు. అలా చేయాలనుకుంటే... ఇకనుంచి ఫైన్ కట్టాల్సిందే. కేబుల్ బ్రిడ్జ్ చూడటానికి వచ్చిన వాళ్లంతా బ్రిడ్జ్ పైనే పార్కింగ్ చేస్తున్నారు. దానివల్ల బ్రిడ్జ్ పై భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఆ సమస్యను నివారిచేందుకు ట్రాఫిక్ పోలీస్ ఎన్నిసార్లు హెచ్చరించినా లాభంలేకుండా పోయింది. దీంతో కొత్త రూల్ తీసుకొచ్చారు. ఇక నుంచి టూ వీలర్ గానీ, ఫోర్ వీలర్ గానీ కేబుల్ బ్రిడ్జ్ పై పార్కింగ్ చేస్తే.. రూ.200 నుంచి రూ.2000 ల వరకు ట్రాఫిక్ పోలీసులు ఫైన్ వేయనున్నారు.



రాత్రిపూట కూడా ఎవరూ పార్కింగ్ చేయకుండా నైట్ విజన్ సీసీ కెమెరాలను అమర్చి ఫైన్‌లు వేయనున్నారు.

## మూడు నెలల్లో
# మార్కెట్ నిర్మాణాలు

### ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా కృషి
### మంత్రి గంగుల కమలాకర్ వెల్లడి

కరీంనగర్,మార్చి14(ప్రజామంటలు): కరీంనగర్ పట్టణంలోని నాలుగు ప్రాంతాల్లో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్లు మరో మూడునెలలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర బీసీ, సంక్షేమ పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆదేశించారు. జిల్లా



కేంద్రంలోని రాంనగర్ లో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను నగర మేయర్ యాదగిరి సునీల్ రావు తో కలసి పరిశీలించారు. వాటి పనుల పురోగతిని మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీకృత మార్కెట్ల ఏర్పాటుతో ట్రాఫిక్ ఇబ్బందులు తీరడంతో పాటు, ప్రజలకు అన్ని రకాల మార్కెట్లు ఒకే దగ్గర అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని వెల్లడించారు. నగరప్రజల కోసం రూ. 40 కోట్లతో సమీకృత మార్కెట్లు సకల హంగులతో నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. కరీంనగర్ వాసులకు నాణ్యమైన, పరిశుభ్రమైన వాతావరణంలో పూలు, పండ్లు, కూరగాయలు, మాంసం ఒకేచోట అందుబాటులో ఉంచే లక్ష్యంతో నగరం నలుమూలల వీటిని నిర్మిస్తోందని అన్నారు. ఒక్కో దానికి రూ. 10 కోట్లను ఖర్చు చేయనున్నామని తెలిపారు. నగరవ్యాప్తంగా రోడ్లమీద 3వేల మంది వ్యాపారాలు నిర్వహిస్తున్నారని వారందరికీ సమీకృత మార్కెట్లలో అవకాశం కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు సూచనల మేరకు సమీకృత మార్కెట్లు నిర్మిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, కార్పొరేటర్లు నేతి రవి వర్మ, నవీన్ కుమార్ తదితరులు ఉన్నారు.

# మద్యంమత్తులో టిసి దుశ్చర్య

### మహిళ తలపై మూత్ర విసర్జన
### పట్టుకుని దేహశుద్ధి చేసిన ప్రయాణికులు

న్యూఢిల్లీ,మార్చి14(ప్రజామంటలు): ఇటీవల విమానంలో ఓ వ్యక్తి మహిళపై మూత్రవిసర్జన చేయగా..తాజాగా ఓ రైలో టిసినే ఇలాంటి ఘాతుకానికి పాల్పడ్డాడు. బాధ్యతగా వ్యవహరించాల్సిన రైల్వే టీసీ రైల్లో అర్ధరాత్రి మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. ఓ మహిళ తలపై మూత్ర విసర్జన చేశాడు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. అకల్ తఖ్త్ ఎక్స్‌ప్రెస్ ఏ1 కోచ్ లో ప్రయాణిస్తున్న బాధితురాలు.. తన భర్త రాజేష్ కుమార్‌తో అమృత్ సర్ నుంచి కోల్‌కతా వెళ్తుంది. అర్ధరాత్రి రైల్వే టీసీ మున్నా కుమార్ మద్యం మత్తులో బాధితురాలి తలపై మూత్ర విసర్జన చేశాడు. దాంతో ఆగ్రహించిన సదరు మహిళ టీసీతో గొడవకు దిగింది. గొడవ వల్ల మెళకువ వచ్చిన మిగతా ప్రయాణికులు టీసీని పట్టుకొని చితక బాదారు. తర్వాత ఛార్ భాగ్ రైల్వే స్టేషన్ లో రైల్వే పోలీసులకు అప్పగించారు. నిందుతుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు. నిందితుడిని బీహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

# మరణించిన పిల్లల కుటుంబాలకు ఆర్థిక సాయం

### చెక్కులు అందచేసిన మంత్రి గంగుల

కరీంనగర్,మార్చి14(ప్రజామంటలు): హోలీ పండుగ రోజున కరీంనగర్ మానేరు వాగులో ప్రమాదవశాత్తు పడి చనిపోయిన ముగ్గురు పిల్లల కుటుంబాలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం తరపున రూ. 3 లక్షలు ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించగా, తన సొంత నిధుల నుంచి మరో రూ. 2 లక్షలు కలిపి మొత్తం 5 లక్షల పరిహారాన్ని చెల్లిస్తామని మంత్రి గంగుల ఇదివరకు ప్రకటించారు. ఇచ్చిన హామీ మేరకు మంగళవారం నష్టపరిహారానికి సంబంధించిన చెక్కులను బాధిత కుటుంబాలకు కలెక్టర్ సమావేశ మందిరంలో అందజేశారు. చని పోయిన పిల్లలను తాము తిరిగి తెచ్చి ఇవ్వలేమని,తమ వంతుగా ఆర్థిక సహాయంఅందిస్తున్నామని, మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. హోలీ పండుగను సంతోషంగా జరుపుకునే సమయంలో ముగ్గురు పిల్లలు మృతి చెందడం బాధాకరమని మంత్రి అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు, అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

# మరోమారు గుత్తికోయల తిరుగుబాటు

### సర్వేకు వచ్చిన అధికారుల అడ్డగింత

మహబూబాబాద్,మార్చి14(ప్రజామంటలు): గుత్తికోయలు మరోమారు తిరగబడ్డారు. సర్వే కోసం వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. అటవీ ప్రాంతంలో భూముల సర్వే కోసం వచ్చిన అటవీ సిబ్బంది,



అధికారులపై గుత్తికోయలు తిరగబడ్డారు. మా భూముల జోలికి వస్తే ఊరుకోం అంటూ వార్నింగ్ ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా ఓటాయి అటవీ ప్రాంతంలో.. మంగళవారం సర్వే కోసం కోసం వెళ్లారు సిబ్బంది. రాంపూర్ అటవీ ప్రాంతంలోని వాచ్ టవర్ దగ్గర ఫారెస్ట్ సిబ్బందిని గుత్తికోయలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వాగ్వాదం జరిగింది. మాటామాట పెరిగింది. మా భూముల్లోకి అడుగు పెట్టొద్దని వార్నింగ్ ఇచ్చారు గుత్తికోయలు. పరిశీలించటానికి మాత్రమే వచ్చామని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు సిబ్బంది. ఎంత చెప్పినా గుత్తికోయలు వినకపోగా.. ఫారెస్ట్ సిబ్బందిపై కొడవళ్లు.. గొడ్డళ్లతో దాడికి ప్రయత్నించారు. దీంతో ఫారెస్ట్ సిబ్బంది తమ వాహనాన్ని వాచ్ టవర్ దగ్గరే వదిలేసి.. కొత్తగూడ అటవీశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. సున్నితమైన అంశం కావటంతో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించారు. కొన్నాళ్ల క్రితం అటవీ శాఖ రేంజ్ అధికారి శ్రీనివాసరావును గుత్తికోయలు చంపిన విషయం తెలిసిందే.. ఆ సంఘటన తర్వాత ఆచితూచి వ్యవహరిస్తున్నారు సిబ్బంది. మహబూబాబాద్ జిల్లాలోని ఓటాయి అటవీ ప్రాంతం లోనూ ఇదే విధంగా గుత్తికోయలు తిరగబడటంతో.. అక్కడే తమ వాహనాన్ని వదిలేసి.. అటవీ అధికారులు, సిబ్బంది పారిపోయి వచ్చారు. మా జోలికి రావొద్దని.. మా భూముల్లోకి రావొద్దంటూ వార్నింగ్ ఇస్తున్నారు ఆ ప్రాంతంలో నివాసం ఉండే

## బిఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా చెక్కు అందజేత

**భీమదేవరపల్లి మార్చి 14 (ప్రజామంటలు):** హుస్నాబాద్ నియోజకవర్గం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన లక్కిరెడ్డి



లింగారెడ్డి ప్రమాదవశాత్తు చనిపోగా వారి ఇంటికి వెళ్లి 2 లక్షల రూపాయల విలువగల బిఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా చెక్కును హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ స్వయంగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. వారి వెంట జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్, జెడ్పిటిసి వంగ రవి, ఎంపీపీ జక్కుల అనిత రమేష్ యాదవ్, మైనారిటీ నాయకులు నవాబ్ పాషా, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు మండల సురేందర్ పాల్గొన్నారు.

## కోరట్ల పట్టణంలో అర్ధరాత్రి దొంగల బీభత్సం

**కోరుట్ల మార్చి 14 (ప్రజామంటలు):** పట్టణంలోని సాయిరాం దేవాలయం దగ్గర 5 సిమెంట్, స్టీల్ దుకాణాల షట్టర్లు పగలగొట్టి, అందులో నగదు దొంగిలించడానికి ప్రయత్నించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రతిరోజు లాగే సోమవారం




రాత్రి సమయంలో షాప్ మూసివెళ్ళగా, అర్ధ రాత్రి సమయం 2.30 గంటల ప్రాంతంలో ఇద్దరు దొంగలు సిమెంట్, స్టీల్ దుకాణాల షట్టర్లు పగలగొట్టి అందులో ఉన్న నగదును దొంగిలించే ప్రయత్నం చేయగా, ఒక షైక్ హబీబ్ అనే వ్యక్తి దుకాణంలో రూ. 35 వేల రూపాయలు దొంగిలించుకు పోయినట్లు తెలిపారు. దుకాణాల్లో సిసి కెమెరాలు ఉండడం వలన దొంగలు ఎంతమంది వచ్చారనేది పోలీసులకు తెలిసిపోయింది. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

## విలేకరిపై దాడికి నిరసనగా రాస్తారోకో

**కోరుట్ల మార్చి 14 (ప్రజామంటలు):** మెట్ పల్లి పట్టణానికి చెందిన ఆంధ్రజ్యోతి విలేఖరి మెన్నేని వేణు రావు పై దాడి చేసిన వ్యక్తులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని. టి యుడబ్ల్యూ జే.జే.యూ. జిల్లా కమిటీ పిలుపు మేరకు కోరుట్ల లో యూనియన్లకు అతీతంగా ప్రెస్ క్లబ్ లకు అతీతంగా అన్ని యూనియన్ ల



విలేకరుల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహాము ముందు జాతీయ రహదారిపై ధర్నా రాస్తారోకో నిర్వహించారు. దాడి చేసిన వ్యక్తులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, విలేకరులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఎస్సై సతీష్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం దర్నా ఆందోళన విరమించాలని ఎస్సై సతీష్ కోరారు. నిందితులను అందరినీ అరెస్ట్ చేసి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విలేకరులు ధర్నా విరమించారు. ప్రెస్ క్లబ్ సభ్యులు చేపట్టిన ఆందోళనకు బిజెపి,కాంగ్రెస్, నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కోరుట్ల ప్రెస్ క్లబ్ ప అధ్యక్షుడు చంద్రశేఖర్. మాల్లికార్జున్, సత్యం, లక్ష్మణ్, మన ప్రెస్ క్లబ్ కోరుట్ల అధ్యక్షుడు చిలివేరీ లక్ష్మీ రాజం, ప్రధాన కార్యదర్శి రాము, ఉపాధ్యక్షుడు మిర్జా ముక్కరం బేగ్, ఇంద్రాల హరీష్, గంగాధర్, బిజెపి నాయకులు, కాంగ్రెస్ నాయకులు సి.పి.ఐ. నాయకులు ఏబీవీపీ నాయకులు విలేకరులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య కార్యవర్గ సమావేశం

**కోరుట్ల మార్చి 14 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సమావేశం కోరుట్ల పట్టణంలోని శ్రీ వాసవి కళ్యాణ భవనంలో జరిగింది. జిల్లా ఆధ్యక్షులు కొత్త సురేష్ మరియు జిల్లాలోని అనేకమంది వైశ్య ప్రముఖులు ఈ



కార్యక్రమానికి హాజరై కార్యవర్గంలో నూతనంగా పదవులు పొందిన పలువురికి శుభాకాంక్షలు తెలియచేశారు. అధ్యక్షులు కొత్త సురేష్ మాట్లాడుతూ జిల్లా ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి మరియు ఆర్యవైశ్యుల ఐక్యతకు కృషి చేస్తానని అందరూ తనకు సహాయ సహకారాలు అందించి, వెంట నడవాలని కోరారు. కార్యక్రమంలో కొత్త, కొత్త సుధీర్, అల్లాడి ప్రవీణ్, పడగల శ్రీనివాస్, అల్లాడి మహేష్, మేడి కిషన్, కూరగాయల శ్రీహరి మోటూరి ప్రవీణ్ పాల్గొన్నారు.

## నిధుల దుర్వినియోగం పై ముచ్చటగా మూడోసారి విచారణ

- **జిపి రికార్డులు సీజ్ చేసి, వాంగ్మూలాలు సేకరించిన విచారణ అధికారి**
- **ఈసారైనా న్యాయం గెలిచేనా...?**

**బుగ్గారం మార్చి 14 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామపంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగం అనే అభియోగం మీద మెటుపల్లి డిఎల్పీవో, ప్రత్యేక విచారణ అధికారి శ్రీనివాస్ మంగళవారం ముచ్చటగా మూడో విచారణ చేపట్టారు. చుక్క గంగారెడ్డి 2022 సెప్టెంబర్ 21న హైదరాబాద్ లోని లోకాయుక్త కు చేసిన పిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈ విచారణ కొనసాగింది. ఎంపివో అప్జల్ సమక్షంలో విచారణ అధికారి జిపి రికార్డులను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. పిర్యాదు దారుడు చుక్క గంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేందర్, సర్పంచ్ మూల సుమలత, నూతన ఉప సర్పంచ్ నగునూరి రామకృష్ణ, ఎంపిటిసి జోగినిపెల్లి సుచెందర్ లతో పాటు విచారణకు హాజరైన ఆరుగురు వార్డ్ సభ్యులతో వాంగ్మూలాలు స్వీకరించారు. త్వరలో విచారణ పూర్తి చేసి, రికార్డుల పరిశీలన జరిపి ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్ లకు నివేదిక అందజేస్తామని విచారణ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మరో ఐదుగురు వార్డు సభ్యులు, ముగ్గురు కో - ఆప్షన్ సభ్యులు ఇట్టి విచారణకు గైర్హాజరయ్యారు. ఇద్దరు వార్డు సభ్యులు మాకు నోటీసు ఇవ్వలేదని విచారణ అధికారికి విన్నవించారు. కార్యదర్శి ఇవ్వలేదా అని అధికారి చెప్పగా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీస్ ఇవ్వకపోవడం పొరపాటు కావున పిర్యాదు చేస్తే పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకుంటామని విచారణ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఇట్టి విచారణ సమయంలో ఎలాంటి అల్లర్లు చోటుచేసుకోకుండా బుగ్గారం ఎస్సై తీగల ఆశోక్ ఆదేశాలతో ఎఎస్సై లక్ష్మీనారాయణ, పోలీస్ సిబ్బంది వెంకటేష్ గౌడ్, స్వామి, సాజిద్ తదితరులు తగు బందోబస్తు నిర్వహించారు. ఈసారైనా న్యాయం గెలిచేనా...? అనుమానాలు వ్యక్తం చేసిన బుగ్గారం ప్రజలు బుగ్గారం జిపి నిధుల దుర్వినియోగం విషయంలో కొనసాగుతున్న పోరాటం లో అధికారులు ముచ్చటగా నేడు మూడోసారి విచారణ చేపట్టారు. కానీ ఈసారైనా న్యాయం గెలుస్తుందా..? దుర్వినియోగం బయటపడి దోషులకు శిక్ష పడుతుందా...?? లేక గతంలో లాగే ఈసారి విచారణ కూడా తూ..తూ



మంత్రమేనా..? అనే అనుమానాలు బుగ్గారం గ్రామస్తులు వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు మొదటిసారి విచారణ 2020 లో చేపట్టి రూ.16,14,585 ల నిధులు దుర్వినియోగం అయ్యాయని షోకాజ్ నోటీసులు ఇచ్చారు. కానీ.. నేటికీ నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 2022 జూన్ లో రెండో విచారణ జరిపి ప్రజలు ఇచ్చిన వాంగ్మూలంతో ప్రజల ముందే బయటపడ్డ నిధుల దుర్వినియోగం లోని వాస్తవాలనే అధికారులు కప్పిపుచ్చారు. నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇక నేడు మూడోసారి జరిపిన విచారణ కూడా ఏమౌతుందోనని గ్రామస్థులు పలు అనుమానాలను వ్యక్తం చేశారు. జిల్లాలోని ఇతర జిపిలలో అట్లా అభియోగం రాగానే ఇట్లా చర్యలు తీసుకొని సర్పంచ్, కార్యదర్శి లను సస్పెండ్ చేశారు. చర్యలు తీసుకున్నారు. మరి బుగ్గారం జిపిలో ఇంత దుర్వినియోగం జరిగినా ప్రజా క్షేత్రం లో దుర్వినియోగం బయటపడ్డా అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## రిపోర్టర్ పై దాడి చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలి

**మెట్ పల్లి మార్చి 14 (ప్రజామంటలు):** మెట్‌పల్లి ఆంధ్రజ్యోతి టౌన్ రిపోర్టర్ పై దాడి చేసిన దుండవులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టియుడబ్ల్యూజే (ఐజేయు) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పరంకుశం నరసయ్య అధికారులను డిమాండ్ చేశారు. టియుడబ్ల్యూజే (ఐజేయు) సభ్యుడు ఆంధ్రజ్యోతి మెట్‌పల్లి టౌన్ రిపోర్టర్ వేణురావుపై శనివారం రాత్రి జరిగిన దాడికి నిరసనగా జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు జిల్లా ఉపాధ్యక్షుడు, మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కోటగిరి దశరథం సూచనల మేరకు మెట్‌పల్లిలోని పాత బస్టాండ్ శాస్త్రి చౌరస్తా వద్ద సభ్యులతో కలిసి ధర్నా నిరసన వ్యక్తం చేయడం జరిగింది. దీంతో రోడ్డుకి ఇరువైపులా కిలోమీటర్ మేరకు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్యామ్ రాజు సంఘటన స్థలానికి చేరుకొని నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పాత్రికేయులు నిరసన దీక్షను విరమించారు. అనంతరం మెట్‌పల్లి సబ్ కలెక్టర్ వినోద్ కుమార్, డీఎస్పీ రవీందర్ రెడ్డిలకు యూనియన్ సభ్యులతో కలిసి వినతి పత్రాలను అందజేసి దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మరల ఇలాంటి దాడులు భవిష్యత్తులో పునరుతము కాకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను కోరడం జరిగింది. ఈ



కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా కార్యవర్గ సభ్యుడు నాంపల్లి నమ్మాద్రి, సీనియర్ పాత్రికేయులు ఎలిగేటి కృష్ణ, సాబీర్ హుస్సేన్, తిరుక్కోవేల వెంకటరమణ, కోటగిరి అరుణ్ గౌడ్, కోస లింగారెడ్డి, గుజ్జేటి శ్రీనివాస్, అమ్ముల ప్రవీణ్, మేకల శివ, వసీం, నాగరాజు, శ్రీనివాస్, సమీ, కార్తీక్, రాంప్రసాద్, రవిరాజ్, అంజయ్య, ఎస్.కె ఇమామ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో కలియుగ దైవానికి ప్రత్యేక పూజలు

**(రామ కిష్టయ్య సంగన భట్ల)**

**ధర్మపురి మార్చి 14 (ప్రజామంటలు) :** ప్రాచీన పుణ్యక్షేత్రమైన ధర్మపురి దేవస్థానంలోని ప్రధానాలయమైన శ్రీవేంకటేశ్వర ఆలయంలో స్వామి వారి ఏకాంతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్షీరోద సంభవాం...



పాలసముద్రంలో జన్మించిన లక్ష్మీదేవి ప్రీతిపాత్రుడై క్షీరాబ్ధిపై శయనించిన వైకుంఠ వాసునికి లక్ష్మీదేవి జన్మస్థానమైన క్షీరమంటే అత్యంత ఇష్టము. అందుకే మహావిష్ణువు క్షీరాభిషేకానికి సంతుష్టుడై, సకల కోర్కెలు నెర వేరుస్తాడని ప్రతీతి. "కృతేతునార సింహాభూత్ త్రేతాయం రఘునందన.., ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకట నాయకః" కృత యుగంలో శ్రీనృసింహునిగా, త్రేతా యుగంలో శ్రీరామునిగా, ద్వాపర యుగంలో శ్రీకృష్ణునిగా, కలి యుగంలో శ్రీవేంక టనాయ కునిగా అవతరించాడు శ్రీమహా విష్ణువు. శ్రీయాధ్య స్థిత వక్షసం... లక్ష్మీదేవి నివాస స్థానమైన వక్షము గల శ్రీవేంకటేశ్వరునికి, క్షీరాభిషేకం సర్వ శ్రేష్ఠం అలాగే స్వామి వారికి ప్రీతిపాత్రము. తనకిష్టమైన దానిని సమర్పించే వారికి ఇష్టమైనవి ఇచ్చే వరదుడు అయిన శ్రీవేంకటేశ్వరుని ఏకాంతోత్సవ సందర్భంగా నిర్వహించే క్షీరాభిషేకం విశేష ప్రాధాన్యతను సంతరించుకున్నది.

**క్షేత్రంలో అంబరాన్ని స్పృశించిన భక్తి పారవశ్యం:**

పవిత్ర గోదావరి నదీ తీరస్థ పుణ్య తీర్థమైన ధర్మపురి క్షేత్రం మంగళవారం భక్తి పారశ్యంతో పొంగి పోయింది. క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన కోరిన కోర్కెలు తీర్చే వరదుడైన శ్రీవేంకటేశ్వరుని ఏకాంతోత్సవ వేడుకలలో పాల్గొన్న, దీక్షలు స్వీకరించిన హన్మాన్ భక్తుల రాకతో క్షేత్రం భక్త, యాత్రిక జనంతో నిండి పోయింది. సుదూర ప్రాంతాల నుండి సనాతన వారసత్వ సాంప్ర దాయాచరణలో భాగంగా విచ్చేసిన భక్త, యాత్రికజనం భగవన్నామ స్మరణలతో, జయ జయధ్వనాలతో క్షేత్రం ప్రతిధ్వ నించింది.



వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజాదికాలలో అధిక సంఖ్యాకులైన భక్తులు పాల్గొన్నారు. ముఖ్యంగా అర్ధ మండల దీక్షాపరులైన హన్మాన్ భక్తుల భక్తి పారవశ్యం అవధులు దాటి అలౌకిక ఆనందాన్ని ఆస్వాదింప జేసింది. భక్తులు పవిత్ర గోదావరిలో మంగళ స్నానాలు ఆచరించి, ప్రధానాలయాల ముందు బారులు తీరి వేచి ఉండి దైవ దర్శనాలు చేసు కున్నారు. విశేషించి దేవస్థానం లోని ప్రసన్నాంజనేయ మందిర ప్రాంగణాన నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఒద్దిపర్తి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో హన్మాన్ భక్తులు మాల ధారణం, మంత్రోపదేశం పొందారు. ఆంజనేయ సన్నిధిలో భక్తజనం దీక్షాపరులైన భక్తులతో ఆంజనేయ ఆలయం కిటకిటలాడింది. ఇటీవలి కాలంలో ధర్మపురి క్షేత్రస్థ దేవస్థానంలో సాంప్రదాయ రీతిలో హన్మాన్ దీక్షలను స్వీకరిస్తున్న నేపథ్యంలో, చైత్ర పౌర్ణమి హన్మాన్ జయంతిని పురస్క రించుకుని, 21 రోజుల పాటు ఆచరించే దీక్షలలో భాగంగా, మంగళవారం పెద్ద సంఖ్యలో ప్రత్యేక హన్మాన్ అర్ధ మండల దీక్షలను స్వీకరించేందుకై వచ్చారు. దేవ స్థానం ఎసి, ఈఓ శ్రీనివాస్, ఆస్థాన వేదపండితులు బొజ్జా రమేశ శర్మ, ఆలయ అర్చకులు వొద్దిపర్తి నర్సింహమూర్తి, కళ్యాణ్ ఆధ్వర్యంలో అంజనీ తనయునికి ప్రత్యేక అభిషేకాలు, నిత్యవిధి పూజలు, అర్చనలు నిర్వహించారు.

### ఈనెల 18 న మండల సర్వసభ్య సమావేశం

భీమదేవరపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18 శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లంకపల్లి భాస్కర్ తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, గ్రామ, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని అన్నారు.



## అనాథలుగా మారిన విద్యార్థులకు వై టీమ్ తరుపున 50 వేల ఆర్థిక సాయం...

**ధర్మపురి మార్చ్ 14 (ప్రజా మంటలు) :** ఇటీవల తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ధర్మపురికి చెందిన చిన్నారులు పెంకర్ల శిరీష, హరీష్ లకు



ఈ రోజు వీ హెల్ప్ యు టీమ్ తరుపున, దాతల సహకారంతో 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరిగింది. 50 వేల రూపాయలను చిన్నారుల పేరుపై ఫిక్స్ డిపాజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు, వై టీమ్ కన్వీనర్ గొల్లపెల్లి గణేశ్, సభ్యులు కషోజ్జల రాకేష్, కషోజల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి విజయ రామారావు మరణం పట్ల మాజీ మంత్రి రాజేశం సంతాపం

**హైదరాబాద్ మార్చ్ 14 (ప్రజా మంటలు) :** మాజీ మంత్రి కె.విజయరామారావు మరణం పట్ల తీవ్ర సంతంప్ తెలుపుట్, ఆయన చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర



ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశం గౌడ్ నివాళులు అర్పించారు. సిబిఐ డైరెక్టర్ గా,ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా విజయ రామారావు విశేష సేవలు అందించారన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుట్, విజయ రామారావు గారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## కంటి వెలుగు 2వ విడత కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్

**హుజూరాబాద్ మార్చి 14 (ప్రజామంటలు):** హుజురాబాద్ పట్టణం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండవ దఫా కంటి వెలుగు కార్యక్రమాన్ని



సందర్శించిన రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ మాట్లాడుతూ.... ప్రజలందరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి వార్డులలో ఉన్న ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలి సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ముందు చూపుతో పెట్టిన ఈ కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరం కలిసి విజయవంతం చేయాలనీ కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ గాంధే రాధికా, కౌన్సిలర్లు రామ రొచెందర్, తాళ్లపల్లి శ్రీనివాస్, మారేపల్లి సుశీల, కుమార్, ముక్క రమేష్,తెరాస నాయకులు బత్తుల సమ్మయ్య, సంపంగి రాజేందర్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బలగం సినీ నటుడికి అభిమానుల ఘన సత్కారం

**హుజురాబాద్ మార్చి 14 (ప్రజా మంటలు) :** బలగం సినిమాలో ముఖ్యపాత్ర పోషించిన హుజురాబాద్ మండలం జూపాక గ్రామానికి చెందిన సినీ రంగస్థల



నటుడు కేతిరి సుదాకర్ రెడ్డికి, హుజురాబాద్ అన్నపూర్ణ థియేటర్లో కళాకారులందరి పక్షాన ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీ కళాకారుడు బుర్ర నటరాజ్, శిశుమందిర్ ఆచార్య సుదర్శన్ రావు, డప్పు కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్ పాల్గొనడం జరిగింది.

# అధికారుల మధ్య సమన్వయ లోపం-ప్రజలకు శాపం

**మాజీ మంత్రి, బీజేపీ నేత మర్రి శశిధర్ రెడ్డి**

**సికింద్రాబాద్, మార్చి 14 ( ప్రజామంటలు ) :** సనత్ నగర్ నియోజకవర్గం బన్సీలాల్ పేట డివిజన్ న్యూ బోయిగూడ కట్టెలమండి నుంచి ఏ1 మటన్ షాప్ మీదుగా శ్రీఉప్పలమ్మ ఆలయం వరకు కొత్తగా చేస్తున్న సీసీ రోడ్డు పనులు లోపబూయిష్టంగా తయారయ్యాయని, జీహెచ్ఎమ్సీ అధికారుల్లో సమన్వయం లోపం ప్రజలకు శాపంగా మారిందని, మాజీ మంత్రి , బీజేపీ నాయకులు మర్రి



శశిధర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక బీజేపీ నాయకులతో కలసి డివిజన్ లో పర్యటించారు. పాత రోడ్డును తవ్వే సమయంలో కాంట్రాక్టర్ అనుభవలేమితో ఇష్టారాజ్యంగా జేసీబీ తో తవ్వడంతో డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లు ధ్వంసం అయ్యాయని , దాంతో మురికినీరు ఏరులై పారుతుండగా, మంచినీరు రాక జనాలు ఇబ్బందుల పాలు అవుతున్నారని అన్నారు.మంచినీటి పైపులైన్ పలగడంతో పరిసరా ప్రాంతాల ప్రజలకు మురికినీరు సరఫరా అవుతుందోని స్థానికులు మర్రి శశిధర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. త్వరలో జీహెచ్ఎమ్సీ ఉన్నతాధికారులను కలసి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామినిచ్చారు. ఆయన వెంట స్థానిక నాయకులు గుంటి సత్యనారాయణ, వై.సురేశ్, కృష్ణ,శ్రీనివాస్, కిరణ్, వికాస్, గోపి,నరేశ్, వంశీ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# సినిమా నటుడిని సన్మానించిన స్నేహితులు

**ఎల్కతుర్తి. ఫిబ్రవరి 14 (ప్రజా మంటలు) :** ఇటీవల విడుదలై మంచి పేరు ప్రఖ్యాతులు గడించిన సినిమా బలగం, నటుడు కేతిరి సుధాకర్ రెడ్డిని ,తమ స్నేహితులు మండల కేంద్రంలో ఘనంగా శాలువాతో సన్మానించారు.



అనంతరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల్లో ప్రతి ఒక్కరి జీవితాన్ని ప్రతిబింబించేలా దర్శకుడు వేణు సినిమాను చిత్రీకరించాలని కొనియాడారు. అదేవిధంగా తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్కరు ఈ సినిమాను చూసి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్ని డబ్బులు సంపాదించిన, ఎంత కీర్తి గడించిన తల్లిదండ్రులను మరవకూడదని,కాన్సెప్ట్ తో ఈ సినిమా తీశారని తెలిపారు. తమ తోటి కళాకారులను కలుసుకునేందుకు వచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో సుక్కినే సుధాకర్ రావు, సోలంకి రాజేశ్వరరావు, గోడి శాల అశోక్ కుమార్, కామెర లక్ష్మణ్ ,హింగే నర్సింగరావు, తదితరులు ఉన్నారు.

# నేడు ఉస్మానియా మెడికల్ కాలేజీలో స్కిల్ ల్యాబ్ ప్రారంభం

**సికింద్రాబాద్, మార్చి14 (ప్రజామంటలు) :** రాష్ట్రంలోనే మొదటిసారిగా ఏర్పాటు చేసిన స్కిల్ ల్యాబ్ రేపటి నుంచి ఉస్మానియా మెడికల్ కాలేజీలో




దుబాటులోకి రానుంది. ఈమేరకు ఈనెల 15 బుధవారం ఉస్మానియా మెడికల్ కళాశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు స్కిల్ ల్యాబ్ ను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా.కె. రమేష్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీకర్ రెడ్డి ప్రారంభించనున్నారని ఉస్మానియా మెడికల్ కాలేజ్ ఎం.పీ.హెచ్.ఈ.ఓ వేణుగోపాల్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# గంగవ్వకు సీతక్క అభినందనలు.

**జగిత్యాల మార్చి 14 (ప్రజా మంటలు) :** ములుగు ఎమ్మెల్యే సీతక్క లంబాడిపల్లి గ్రామానికి చెందిన, ప్రముఖ యూట్యూబ్ ఛానెల్ మై విలేజ్ షో నటి గంగవ్వ కు నూతన వస్త్రాలు పంపగా యువజన కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు



నాగి శేఖర్, లాంబడిపల్లె గ్రామంలోని గంగవ్వ నివాసంలో ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క తనపై చూపించిన అభిమానానికి, గంగవ్వ కృతజ్ఞతలు తెలియజేశారు.

# సంప్రదాయరీతిలో ఉగ్రనారసింహ పుష్పయాగం

**ధర్మపురి మార్చ్ 14 (ప్రజా మంటలు) :** బ్రహ్మోత్సవాలలో అంతర్భాగంగా మంగళ వారం రాత్రి కోరిన కోర్కెలు తీర్చే దైవ మైన ఉగ్రనారసింహుని పుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించారు. లోక కళ్యాణార్థం, భక్తజన కోరికల సాఫల్యార్థం నిర్వహించిన పుష్పయాగం దేవస్థాన పౌరోహితులు వామనాచార్య, వేదవిదులు రమేశశర్మల ఆచార్యత్వంలో అర్చకులు వంశీ, నరసింహమూర్తి తదితరులు జరిపించారు. ఆలయ మంటపంలో పంచాబ్జమును చిత్రించి, పుష్పపీఠాసీనుల జేసి, నలువైపులా ద్వార కుంభాలనుంచి వాసుదేవ పుణ్యాహ వాచనం, షోడశాక్షరీ మంత్ర పఠనం గావించి, చతుర్వేదాలతో, సంగీతాది కళలతో ఉగ్రనా రసింహుని సేవించగా భక్తిశ్రద్ధలతో కొలిచారు.



**వేంకటేశ్వర ఏకాంతోత్సవ వేడుకలు**

మంగళవారం రాత్రి దేవస్థానంలో నిర్వహించిన శ్రీవేంకటేశ్వర స్వామి ఏకాంతోత్సవ వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా దేవస్థానం లోని ప్రధానాలయమైన వేంకటేశ్వరుని దేవాలయంలో, సనాతన సాంప్రదాయ ఆచారం క్రమంలో రాత్రి 9.00 గంటలకు ప్రారంభమై అర్ధరాత్రి దాటే వరకు కొనసాగిన ఏకాంతోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో ముందుగా ఏడు కొండల పెన్నిధి మూల విరాట్టును సర్వాంగ సుందరంగా, బిలోలికి చెందిన భక్తులు శంకర్ అరుగులవార్ సహకారంతో, దాతృత్వంతో, అర్చకులు నేరేళ్ళ శ్రీనివాసాచార్య, మోహనాచార్య, విజయ్, కిరణ్ లు ప్రత్యేకంగా మున్నెన్నడూ లేని విధంగా, పుష్పాలంకృతుల గావించి, విశేష ఉత్సవాలంకారాలతో తీర్చి దిద్దారు. అలంకృత ఉత్సవ మూర్తులను దేవాలయం నుండి మంగళ వాద్యాలతో కొనితెచ్చి, ధ్వజ స్థంభం వద్ద ప్రత్యేక పూజాదికాలొనర్చారు. వేద, శాస్త్ర, పురాణ, సంగీత, నృత్య, వాద్య, మౌనాది ప్రదక్షిణలు చేశారు. భక్తి శ్రద్ధాసక్తులతో ధార్మిక కార్యాను రక్తులు, సదాచారాభిలాషులైన భక్తులు తోడురాగా, ఆలయం చుట్టూ బోయీలు, భక్తులు స్వామిని ఏడు ప్రదక్షిణలు గావించారు. దేవస్థాన యాజ్ఞికులు వామనాచార్య, ఆస్థాన వేదపండితులు బొజ్జా రమేశశర్మ, ఆలయ అర్చకులు నేరేళ్ళ శ్రీనివాసాచార్య, విజయ్, మోహన్, కిరణ్, దేవస్థానం ఈఓ శ్రీనివాస్, మార్గదర్శకత్వంలో, విధివిధాన పాంచరాత్ర ఆగమ విధిన వైష్ణవ వేదోక్త సాంప్రదాయ కార్యక్రమాలు జరిపారు.

# విలేఖరులకు రక్షణ కల్పించాలి

- **విలేఖరిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి**

**బుగ్గారం మార్చ్ 14 (ప్రజా మంటలు) :** తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల కు రక్షణ కల్పించాలని బుగ్గారం మండల పాత్రికేయులు ప్రభుత్వాన్ని కోరారు. బుగ్గారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. అక్కడి నుండి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు.. ఈ సందర్భంగా జర్నలిస్ట్ లు మాట్లాడుతూ, జగిత్యాల జిల్లా మెట్ పెల్లి టౌన్ లో ఆంధ్రజ్యోతి విలేఖరిగా పని చేస్తున్న వేణుగోపాల్ రావు పై శనివారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు దాడులకు పాల్పడడం దురదృష్టకరం అన్నారు. కేవలం అతడు వార్తలు రాసాడనే నెపంతో ఈ దాడి జరిగిందని అన్నారు. వార్త రాస్తే దాడులకు దిగడం ఇదేం సంస్కృతి అని ప్రశ్నించారు. మూడు రోజుల క్రితం దాడి జరిగిన, నేటికీ పోలీసులు చర్యలు తీసుకోకవడం శోషణీయం అన్నారు. నిందితులను అరెస్ట్ ఎందుకు చేయడం లేదని వారు ప్రశ్నించారు. విలేఖరిపై దాడికి పాల్పడ్డ వారిని వెంటనే అరెస్ట్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ నాయకులు మొగిలి సుధన్, గౌరీ శంకర్, సీనియర్ జర్నలిస్టు చుక్క గంగారెడ్డి, పాత్రికేయులు బుక



ప్రవీణ్, నక్క చంద్ర మౌళి, దూడ చిరంజీవి కుమార్, కళ్లెం నగేష్ , నక్క శంకర్, చిర్ర సత్యం, పల్లేర్ల సురేష్, జైషెట్టీ రాకేష్, తిరుపతి, గంగాధర్ పాల్గొన్నారు

# కళాకారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- **వివిధ ఆలయాల్లో కళారూపాల ప్రదర్శనకు**
- **కళాకారులకు అవకాశం కల్పించేందుకు కృషి**
- **రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్**

**హైదారాబాద్ మార్చి 14 (ప్రజామంటలు):** కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని, సకల కళలను ఆదరిస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఎల్.బీ. స్టేడియం ప్రాంగణంలో నటరాజ్ అకాడమీ, మాంగళ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో "కేసిఆర్ ఉండగా, ప్రతి రోజూ కళా పండుగే" అనే నినాదంతో జానపద కళాకారుల మహా ర్యాలీని వినోద్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.... కళలను, కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదరిస్తోందని అన్నారు. ముఖ్యంగా జానపద కళలు కనుమరుగు కాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలోని యాదగిరిగుట్ట, వేములవాడ, ధర్మపురి, కొండగట్టు, కొమురవెల్లి వంటి వివిధ ప్రధాన ఆలయాల్లో సాయంత్రం పూట భక్తుల కోసం కళా రూపాలను ప్రదర్శించేందుకు జానపద కళాకారులకు అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వినోద్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కళాకారుల పాత్ర మరువలేనిదని అన్నారు. కళాకారులను ఆదుకునేందుకు సాంస్కృతిక సారథి సంస్థ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఉపాధిని కల్పించారని వినోద్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో



రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్, ర్యాలీ నిర్వాహకులు బత్తిని కీర్తి లతా గౌడ్, గిరి, శరత్ చంద్ర, గడ్డం శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందుర్తిలో కంటి వెలుగును ప్రారంభించిన సర్పంచ్ అందే స్వరూప.

**చిగురుమామిడి మార్చి 14 (ప్రజామంటలు):** మండల పరిధిలోని ఇందుర్తి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం కంటి వెలుగును గ్రామ సర్పంచ్ అందే స్వరూప ప్రారంభించారు. అనంతరం వైద్యాధికారి ధర్మానాయక్ సర్పంచ్ కు వార్డు సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి అద్దాలను అందజేశారు. చిగురుమామిడి మండలంలోని గ్రామాలలో కంటి వెలుగు వైద్య శిబిరాలు విజయవంతముగా నడుస్తున్నాయని మండల వైద్యాధికారి డా. ధర్మ నాయక్ తెలిపారు. ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను సైతం పంపిణీ చేశారు ప్రతి రోజూ దాదాపుగా 250-300 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నామని, అవసరమైన వారికీ అద్దాలు పంపిణీ చేస్తున్నామని, దగ్గర చూపు అవసరం ఉన్నవారికి సైతం వెంటనే అద్దాలను పంపిణీ చేశామని తెలిపారు. దూరపు చూపు వారికి కూడా అద్దాలు త్వరలో అందిస్తామని తెలిపారు మండలంలో అతిపెద్ద గ్రామ%శీ% ఇందుర్తిలో 15 రోజుల పాటు కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు వైద్య సిబ్బందికి సహకరించాలని సూచించారు ఈ కార్యక్రమములో ఉపసర్పంచ్ తోట సతీష్ వార్డు సభ్యులు చిలుపూరి విష్ణు, చింతపూల శ్యామల, అపాల యశోద, భూరికి విజయ, సిరాజ్, డాక్టర్ శ్రీను రైతు సమన్వయ సమితి అధ్యక్షులు చింతపుల అంజయ్య, లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదే రఘునాథ్



రెడ్డి, కార్యదర్శి వెంకటరమణారెడ్డి, డా. నిర్మల, సూపర్వైజర్ హేమలత, ఏఎన్ఎం లు జే. కవిత, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ చౌర్యం కేసులో నిందితుడికి జైలు శిక్ష జరిమానా

**జగిత్యాల మార్చి 14 (ప్రజా మంటలు) :** సారంగాపూర్ మండలము చెందిన వద్కాపురం రాములు తేది : 10.08.2014 రోజున విద్యుత్ చౌర్యం చేస్తూ పట్టుబడగా మొదటి నేరం క్రింద రూ.లు 1000/- జరిమానా మొదటి తప్పుగా భావించడం అయినది. తదుపరి అదే నేరస్థుడైన తేది: 19.08.2016 రోజున చేస్తూ రెండవసారి పట్టుబడగా రెండవనేరం క్రింద విజిలెన్స్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుచగా జగిత్యాల జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తైన శ్రీ. వీరయ్య నేరస్థునిపై విచారణ జరుపగా నేరస్థుడు వద్కాపురం రాములు విద్యుత్ చౌర్యం చేసినట్లు రుజువైనందున నేరస్థుడికి రూ.లు 17244/- జరిమాన, మూడు నెలల జైలు శిక్ష విధించబడినదని విజిలెన్స్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు కె. స్వామి తెలిపారు.

# అంతర్జాతీయ స్థాయి జూమ్ సమావేశంలో రేణుకుంట్ల మురళి

**జనగామ మార్చి14 (ప్రజామంటలు)బీ:** ది ఫర్టైల్ బ్రేన్స్ ఆంగ్ల సాహితీ సంస్థ ఓపెన్ థీమ్ పై అంతర్జాతీయ స్థాయిలో జూమ్ సమావేశం




కె.ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రపంచ నలుమూలలనుండి కెనడా, యుకె, యుఎస్ఏ,పాకిస్తాన్, బ్రెజిల్, ఫిలిప్పీన్స్, సింగపూర్, ఇజ్రాయెల్ దేశాల నుండి దాదాపు ముప్పై మంది కవులు, రచయితలు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుండి ఫర్టైల్ బ్రేన్స్ కో-కన్వీనర్ రేణుకుంట్ల మురళి పాల్గొన్నారు. ఈ సమావేశంలో శాలిని నంద కియోల్యార్,తాంజ అజిటిక్,శ్యామ్ ప్రసాద్ పట్నాయక్,గంగ లక్ష్మి పట్నాయక్,మేరియా ఎలివిరా,డాక్టర్ రూపాలి సర్కార్ గౌర్,లెఫ్టినెంట్ కల్నల్ అంకిత శ్రీ వాస్తవ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**ఇబ్రహీంపట్నం మార్చ్ 14 (ప్రజా మంటలు) :** మండల కేంద్రంలోని ఆయా గ్రామాలకు సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు గారి కుమారుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ 30 చెక్కులు, రూ.7 లక్షల 28,000 పంపిణీ చేయడం



జరిగింది.ఇట్టి కార్యక్రమంలో జడ్పిటిసి కంఠం భారతి, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు పొనకంటి చిన్న వెంకట్, సర్పంచులు నేమూరి లత, సంగం సాగర్, లింగంపల్లి గంగాధర్, దేశెట్టి చిన్న నర్సరెడ్డి, ఆవుల మహేష్, నాయకులు జాజాల జగన్ రావు, కంఠం రమేష్, నేమురి సత్యనారాయణ, గూడ రామ్ రెడ్డి, బద్దం గోపి, జిల్లాల పవన్, రెబ్బటి రాజేందర్ యాదవ్, దొంతుల తుకారాం, దోమకొండ రాజన్న, గుంటి దేవయ్య, నేరెళ్ల దేవేందర్, సుద్దాల జగన్, బట్టు రాజశేఖర్, దాసరి రాజన్న, నల్ల తిరుపతిరెడ్డి, దేశెట్టి జీవన్, బోనగిరి భూమేష్, జింక శ్రీనివాస్, బాజన్న, కనక జగన్ తదితరులు పాల్గొన్నారు.

# రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్.

**జగిత్యాల మార్చి 14 (ప్రజా మంటలు) :** బీర్పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలోని రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాలు మరియు బోనాల జాతర



మహోత్సవానికి హాజరై శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మరియు జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు డా. గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో పాటు బీర్పూర్ మండలం గౌడ సంఘం అధ్యక్షులు శీలం రమేష్ గౌడ్,జిల్లా గౌడ సంఘం కార్యవర్గ సభ్యులు దోసారపు బుచ్చన్న గౌడ్ గారు,గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు బట్టల దుబ్బాయ గౌడ్, లింగన్న,సత్తాన్న,పెద్ద గంగయ్య,శంకర్, రాజేశం,రాజన్న,గంగన్న తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికి చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

**సికింద్రాబాద్, మార్చి 14 ( ప్రజామంటలు) :** సమాజానికి చేసిన సేవలు, ఆపదలో నలుగురిని ఆదుకున్న సందర్భాలు వ్యక్తులకు తప్పనిసరిగా గుర్తింపునిస్తాయని, ఆలిండియా ముదిరాజ్ సమాజ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్



పొట్లకాయల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సిటీలో ప్రముఖ సంఘ సేవకులు, నాయకులు అంబర్ పేట శంకరన్న జన్మదినం సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలసిన వెంకటేశ్వర్లు బర్త్ డే విషెస్ చెప్పారు. శంకరన్న మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని, సామాజిక సేవలో తరించాలని ఆకాంక్షించారు.

# కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీపీ మానస

**హుస్నాబాద్ 14 మార్చి (ప్రజా మంటలు) :** హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామంలో లకావత్ మానససుభాష్ హుస్నాబాద్ ఎంపీపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మిర్జాపూర్ లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం పి పి మానస మాట్లాడుతూ, పేదల కళ్ళల్లో ఆనందం నింపడం కోసమే కంటి వెలుగు కార్యక్రమం అని , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం




ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ముందు చూపుతో రాష్ట్రంలో ప్రజలందరికీ కంటి వెలుగు కార్యక్రమాన్ని మొదటి విడత ప్రారంభించి అనేకమందికి కంటి అద్దాలను అందించారని, తిరిగి రెండో విడత కార్యక్రమాన్ని చేపట్టారన్నారని అన్నారు. ప్రజలు ఎవరూ కంటి సమస్యలతో బాధపడవద్దనే లక్ష్యంతో కంటి పరీక్షలను నిర్వహించి అద్దాలతో పాటు మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారని, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లను సైతం చేయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ రజిని శాలువతో సత్కరించారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన రజని తిరుపతి రెడ్డి , గ్రామ సర్పంచ్ తరాల లత మహేందర్ ఉప సర్పంచ్ పొన్నాల లక్ష్మి స్వామి వార్డ్ మెంబర్లు, ఎంపీ ఓ సత్యనారాయణ , డాక్టర్ నిఖిత వైద్య బృందం, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీఎన్జీవి ఏ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ.

**జగిత్యాల మార్చి 14 (ప్రజా మంటలు) :** పశువైద్య పశుసంవర్ధక శాఖ తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నరియన్స్ అసోసియేషన్ 2023 డైరీ



మంగళవారం జిల్లా కలెక్టర్ యాస్మిని భాష జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ అధికారి గోపాలకృష్ణమూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నరీయన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కందుకూరి పూర్ణచందర్, కార్యదర్శి నాగేందర్ రెడ్డి, కోశాధికారి గణేష్,ఉపాధ్యక్షులు దైవ వీణ సురేఖ, గరిగంటి రవి, రాష్ట్ర అసోసియేషన్ సభ్యులు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎలిగేటి రవీందర్ రాజకుమార్, శ్రీనివాస్, కార్యాలయం పర్యవేక్షకులు అశోక్, సీనియర్ అసిస్టెంట్లు శైలజ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## పాన్ వరల్డ్ స్టార్ల పారితోషికం డబుల్ ట్రిపుల్?

పాన్ వరల్డ్ మూవీ RRR హీరోల దశ దిశ మార్చేసింది. సౌతిండియా స్టార్లు రామ్ చరణ్ - ఎన్టీఆర్ క్రేజ్ అమాంతం స్కైని టచ్ చేస్తోంది. గోల్డెన్ గ్లోబ్ - హెచ్.సి.ఏ- ఆస్కార్ పురస్కారాలతో 'ఆర్.ఆర్.ఆర్ నాటు నాటు.. 'మోత మోగించింది. ఇక ఇదే అదనుగా ఈ ఇద్దరికీ అటు హాలీవుడ్ లోను అవకాశాలొస్తున్నాయని కథనాలొస్తున్నాయి. ఆస్కార్ అవార్డుల్లో ఆర్.ఆర్.ఆర్ ప్రమోషన్స్ కోసం పలు ఈవెంట్లకు పార్టీలకు అటెండయిన ఎన్టీఆర్ - రామ్ చరణ్ లను ఎంతో దగ్గరగా వీక్షించిన పలువురు హాలీవుడ్ ఫిలింమేకర్స్ తమ సినిమాల్లో నటింపజేయాలని ప్రయత్నిస్తున్నట్టు కథనాలొస్తున్నాయి. ఆర్.ఆర్.ఆర్ చిత్రంలో ఆ ఇద్దరి ఎనర్జిటిక్ పెర్ఫామెన్స్ కామెరూన్ - స్పీల్ బర్గ్ లాంటి ప్రముఖ దర్శకులను ఆకర్షించింది. ఇన్నాళ్లు ఆ ఇద్దరూ పాన్ ఇండియా డైరెక్టర్లు రాజమౌళి- ప్రశాంత్ నీల్- సుకుమార్- సిద్ధార్థ్ ఆనంద్ లాంటి వాళ్లతో సినిమాలకు ప్లాన్ చేస్తారని ఊహిస్తే ఇప్పుడు ఏకంగా హాలీవుడ్ డైరెక్టర్లతో పాన్



వరల్డ్ సినిమాల్లో నటించే అవకాశం ఉందని కథనాలు వేడెక్కిస్తున్నాయి. అంతేకాదు.. ఆ ఇద్దరికీ మార్కెట్లో బ్రాండ్ వ్యాల్యూ కూడా అమాంతం పెరిగిందంటూ విశ్లేషిస్తున్నారు. ఒక్కో సినిమాకి 20 కోట్లు అందుకునే రామ్ చరణ్ ఆర్.ఆర్.ఆర్ కోసం 45 కోట్ల మేర పారితోషికం అందుకున్నారని .. ఎన్టీఆర్ సైతం ఇంచుమించు అదే రేంజులో ఉన్నాడని టాక్ వినిపిస్తోంది. అంతేకాదు ఒక్కో బ్రాండ్ తో ప్రచారం కోసం 3-4 కోట్ల మేర కాంట్రాక్ట్ కుదుర్చుకునే రామ్ చరణ్ రేంజ్ ఇప్పుడు 7-8 కోట్ల రేంజును తాకుతోందని తెలుస్తోంది. ఆస్కార్ అందుకోవడంతో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆ ఇద్దరు స్టార్లు యూత్ ఐకన్స్ గా మారారు. అదే క్రమంలో పలు కార్పొరెట్ ఉత్పత్తులు వారితో ప్రచారం చేయించుకునేందుకు క్యూ కడుతున్నాయని సమాచారం. పెప్సీ- అపోలో -జియో- హీరో మోటోకార్ప్-ఫ్రూటీ-టాటా డొకొమో- వోలానో- ట్రూజెట్ వంటి వాటికి రామ్ చరణ్ ప్రచారకర్తగా ఉన్నారు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ పరిమితంగా వాణిజ్య ప్రకటనల్లో నటిస్తున్నారు. ఇకపై అంతర్జాతీయ బ్రాండ్లకు ఈ ఇద్దరూ ప్రచారం చేసే వీలుంటుందని అంచనా. అలాగే ప్రస్తుతం 50 కోట్ల లోపు ఉన్న పారితోషికాన్ని 100 కోట్ల రేంజుకు పెంచేస్తారని కూడా ట్రేడ్ లో అంచనాలు వెలువడుతున్నాయి.

### ఉదయాత్పూర్వమే కొండగట్టు

# అంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత

**కొండగట్టు మార్చి 14 (ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం పవిత్ర పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్నను మంగళవారం ఉదయాత్పూర్వము ఎమ్మెల్సీ కవిత దర్శించుకున్నారు. ఎలాంటి సమాచారం లేకుండా కవిత కొండగట్టు ఆలయాన్ని దర్శించుకోవడం పట్ల ప్రజలు వీస్తూ పోతున్నారు. ఇటీవల ఈడి విచారణకు వెళ్లి వచ్చిన కవిత మరో మారు విచారణకు వెళ్లనుంది.ఈ నేపథ్యంలో తనను అంజన్న రక్షించాలని కోరుకోవడానికి వచ్చినట్లుగా స్థానికులు చర్చించుకుంటున్నారు. స్థానిక శాసనసభ్యులు రవిశంకర్ కు కానీ స్థానిక నాయకులకు కానీ సమాచారం లేకుండానే కవిత ఒక్కరే వచ్చి అంజన్నను దర్శించుకున్నారు. కాగా ఆలయ ప్రధాన అర్చకులు జితేంద్ర ప్రసాద్ ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి తదితరులు



కవితకు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# వీధి కుక్కల దాడి....

- జనగామ మున్సిపల్ కమిషనర్‌పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

**జనగామ మార్చి 14 (ప్రజామంటలు):** కుక్కలు, కోతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజల బాధను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన మున్సిపల్ కమిషనర్ సరిత పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని జెఏసి కన్వీనర్ మంగళంపల్లి రాజు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.... జనగామ జిల్లాలోని వీవర్స్ కాలనీలో కుక్కలు కోతులు రోజురోజుకు వాటి వలన 11వ వార్డు, 12వ వార్డులో ఉన్న ప్రజలు భయాందోళనకు గురౌతున్నారని, మంగళవారం చెన్నూరి సరూప తల్లిదండ్రులు చెన్నూరి రాజేష్ రేఖ వీవర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చెన్నూరి సరూప 12 గంటలకు మధ్యాహ్నం స్కూలు నుంచి ఇంటిదగ్గర వాటర్ బాటిల్ తీసుకురావడానికి వస్తున్న క్రమంలో వీధి కుక్కలు దాడి చేశాయని అన్నారు. చుట్టుపక్కల వారు గమనించి పాపను రక్షించారని, పాప కాలుకు కాట్లు పడడంతో స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ కు తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారని అన్నారు. ఈ సంఘటన పై జనగామ జిల్లా జెఏసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తుందన్నారు. జనగామ జిల్లాలో బతికే పరిస్థితి లేదని బాధ పడుతున్నానని తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ ప్రజల కోసం పని చేయాలని విజ్ఞప్తి చేశారు. చిన్నారులకు వృద్ధులకు కుక్కలతో కోతులతో పెను ప్రమాదం ఏర్పడే అవకాశాలు ఉన్నందున ప్రమాదాలు జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు



తీసుకోవాలని, వార్డు ప్రజలు, ప్రజా ప్రతినిధులలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెఏసి నాయకులు తుంగ కౌశిక్, కొండ్ర ప్రవీణ్, వెంపటీ అజయ్, శ్రీనివాస్, భింగి నర్సింహులు, నర్సింగ్, అనిల్ చౌహాన్ పాల్గొన్నారు.

# జీవన్ రెడ్డిని విమర్శించే ముందు వాస్తవాలు తెలుసుకొండి

- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి

**జగిత్యాల మార్చి 14 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా అభివృద్ధికి బాటలు వేసిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని విమర్శించే ముందు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని జిల్లా కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి, బిజేపి నాయకులు బోగ శ్రావణికి హితవు పలికారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో విజయలక్ష్మి మాట్లాడుతూ. జగిత్యాల జిల్లా అభివృద్ధికి బాటలు వేసిందే జీవన్ రెడ్డి అని, రాజకీయాల్లోకి వచ్చిన మూడు నాళ్లకే, ఏ తప్పు చెయ్యంది మీరు రాజీనామా ఎందుకు చేసారో ప్రజలకు తెలుపాలని, రాజీనామా చేసి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన మీరు నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం ఉన్న నాయకున్నివిమర్శించడం తగదని హెచ్చరించారు. పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సభకు ప్రజల స్పందన చూసి ఓర్వలేకనే నీ విమర్శలు చేస్తున్న నీవు, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, పొలాస వ్యవసాయ కళాశాల, జె ఎన్ టియు, న్యాక్ కేంద్రాలు, మామిడి మార్కెట్ ఎలా వచ్చాయో తెలుసుకొని మాట్లాడాలని, చెక్కర ఫ్యాక్టరి మూసివేత హౌస్ కమిటీలో జీవన్ రెడ్డి లేరనే విషయం కూడా అతెలియకుండా విమర్శించడం వారి అవగాహన లోపమని విజయలక్ష్మి అన్నారు. పసుపు బోర్డు తెస్తానని చెప్పి ప్రజలను మోసం చేసిన బీజేపీ ఎంపీ అరవింద్ ను



నిలదీయాల్సింది పోయి, నిరంతరం ప్రజలతో ఉన్న నాయకుణ్ణి విమర్శించడం మూర?త్వమని ఆమె అన్నారు.

# మెడికల్ కాలేజ్ ఏర్పాట్ల పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**జనగామ మార్చి 14 (ప్రజామంటలు):** జనగామ పట్టణంలోని ప్రభుత్వ ఎ.బి.వి. డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం తరగతుల ప్రారంభం కానున్న నేపథ్యంలో మెడికల్ కాలేజ్ ఏర్పాట్ల కోసం పీజీ బ్లాక్, ఫిజిక్స్ బ్లాక్ లలో కలిపి ఎనిమిది రూములను కేటాయించారు. ఆ పనులను, తరగతుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలన మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలక్టర్ సి.హెచ్. శివలింగయ్య పరిశీలించారు. కాలేజీ ఏర్పాటు కోసం మౌలిక వసతుల కల్పన సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం బుధవారం నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరము, రెండవ సంవత్సరము పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఏర్పాటు చేసిన సెంటర్లు తనిఖీ చేశారు, రూములలో టేబుల్స్, విద్యుత్తు, త్రాగునీరు సదుపాయా లను పరిశీలించారు, ప్రభుత్వ సూచనల మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇప్పటికే పలుదాఫాల్లో సమీక్ష సమావేశాలు నిర్వహించామని పరీక్షల సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేసినట్లు ఎన్నికల నిర్వహణ కోసం సర్వం సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఐఈఓ



బి. శ్రీనివాస్, డాక్టర్ సుగుణాకర్ రాజు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ గోపాలరావు, ఏబీవీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నర్సయ్య, పరిపాలన అధికారి సులేమాన్, స్థానిక తహసిల్దార్ బి. రవీందర్, సంబంధిత అధికారులు ఉన్నారు.

# ముత్తిరెడ్డి నీళ్ల దాహం వల్లనే యువరైతు బలి

- మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి
- మృతుని కుటుంబానికి కొమ్మూరి ఆర్థిక సహాయం

**జనగామ మార్చి 14 (ప్రజామంటలు):** జనగామ జిల్లా అడవికేశవాపురం గ్రామంలో గూడ రాజు కరెంట్ షాక్ తో మరణించగా మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి వారి కుటుంబాన్ని ఫోన్ లో పరామర్శించి, 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పంపించారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి వల్ల యువ రైతు బలి కావడం చాలా బాధాకరమన్నారు. ముత్తిరెడ్డి నిర్లక్ష్య కారణం వల్లనే దళిత రైతు మరణించడం జరిగిందని, ఈ ప్రాంత రైతులు అభివృద్ధి చెందాలని గతంలో తాము రిజర్వాయర్లను ఏర్పాటు చేశానని, కానీ ఇపుడు ఉన్న ఎమ్మెల్యే రైతుల బాగు కోసం కాకుండా కేవలం తన భూమికి మాత్రమే నీరు అందే విధంగా కాలువలను గండి కొట్టి రిజర్వాయర్ లో ఉన్న నీటిని అక్రమంగా తన వ్యవసాయ భూమికి నీళ్లు మళ్లించుకున్నారు తప్ప స్థానిక రైతుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఈ యువరైతు చావుకి కారణమైన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి బాధ్యత వహించి వెంటనే ప్రభుత్వం ద్వారా మృతుని కుటుంబానికి 20 లక్షలు ఎక్స్ గ్రేషియ అందించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని నేను డిమాండ్ చేశారు. ధర్మసాగర్ నుండి ఇతర నియోజకవర్గాలకు నీళ్లు పోతుంటే మన ప్రాంతానికి నీళ్లు తీసుకురావడంలో ముత్తిరెడ్డి విఫలమయ్యారని, బొమ్మకూరు రిజర్వాయర్ లో అడుగు భాగాన ఉన్న నీటిని పక్కనే ఉన్న తన వ్యవసాయ భూమికి తరలించు కుంటున్నారని అన్నారు. ఈ



కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జయరాం, కాంగ్రెస్ నాయకులు భస్సీ, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి క్రాంతి, నియోజకవర్గ అధ్యక్షుడు యాట క్రాంతి, నిఖిల్ గౌడ్, శివయ్య గౌడ్, యాదయ్య, చక్రి, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# 'కస్టడీ' టీజర్ డేట్ ఫిక్స్..

యంగ్ హీరో నాగచైతన్య నటిస్తున్న తాజా చిత్రం 'కస్టడీ'. తమిళ్ డైరెక్టర్ వెంకట్ ప్రభు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో చైతన్య పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. అతనికి జోడీగా కృతిశెట్టి హీరోయిన్‌గా నటిస్తుంది. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు చిత్రంపై మరింత క్యూరియాసిటీని పెంచుతూ మేకర్స్ ఓ వీడియో విడుదల చేశారు. ఈ సినిమా టీజర్‌ను ఈనెల 16నరిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఓ సముద్రంలో ఉన్న జైల్లో ఉన్న నాగచైతన్య తలుపు తీసుకుని బయటకు వస్తున్న వీడియోను విడుదల చేశారు. కాగా సినిమా మే 12న థియేటర్లలో విడుదల కానుంది. రాధికా శరత్ కుమార్, ప్రియమణి, వెన్నెల కిశోర్ ఇందులో కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# చిన్న పిల్లలకు ఎంతో నచ్చుతుంది : సమంత

గుణశేఖర్ దర్శకత్వంలో సమంత నటించిన 'శాకుంతలం' కోసం సినీ ప్రియులంతా ఆసక్తిగా ఉన్నారు. తాజాగా సమంత ఒక్క ట్వీట్‌తో అందరిలో జోష్ నింపింది.'ఇప్పుడే సినిమా చూశాను. గుణశేఖర్ గారు ఈ సినిమాను



ఎంతో అందంగా తీర్చిదిద్దారు. ఒక గొప్ప ఇతిహాసానికి మనోహరంగా జీవం పోశారు. ఇందులోని భావోద్వేగాలు అందరికీ నచ్చుతాయి. చిన్న పిల్లలకు కూడా ఈ చిత్రం ఎంతో నచ్చుతుంది. ఈ సినిమాకు నా మనసులో ఎప్పటికీ ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. ఇంత మంచి చిత్రాన్ని ఆడియన్స్‌తో కలిసి చూడడం కోసం వెయిట్ చేస్తున్నాను' అని తెలుపుతూ చిత్ర నిర్మాతలకు కృతజ్ఞతలు చెప్పింది. కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించిన విషయం తెలిసిందే. శకుంతల, దుష్యంత మహారాజుల మధ్య ఉన్న ప్రేమ నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. ఇందులో శకుంతల పాత్రను సమంత పోషించగా.. దుష్యంతుడి పాత్రలో దేవ్ మోహన్ నటించారు.

# మాస్, యాక్షన్‌తో దసరా ట్రైలర్

నాని హీరోగా కీర్తి సురేష్ హీరోయిన్ గా ప్రస్తుతం తెరకెక్కిన భారీ పాన్ ఇండియన్ మూవీ దసరా. శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ మూవీని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి నిర్మించగా సంతోష్ నారాయణన్ దీనికి మ్యూజిక్ అందించారు. తాజా ఈ మూవీ



ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్ విషయానికొస్తే.. వెన్నెల వచ్చిందిరా.. ధరణిగా పెట్టి పుట్టావ్ రా నా కొడకా అంటూ నాని, కీర్తి సురేష్‌ల డైలాగ్స్‌తో ట్రైలర్ మొదలయ్యింది. తినడం, ఎవరినైనా కొట్టడం, తాగడం, పడుకోవడం.. ఇది ధరణి అలవాటు. అలా తాగి ఒక చేయరాని తప్పు ధరణి చేసినట్లు చూపించారు. దాని పర్యవసానంగా ధరణి, అతని స్నేహితులు చిక్కుల్లో పడడం.. ఆ తప్పును సరిద్దిదుకోవడానికి ధరణి కత్తి పట్టడం లాంటివి చూపించారు. అసలు ధరణి చేసిన తప్పు ఏంటి..? దాని ద్వారా నష్టపోయింది ఎవరు..? ఆ తప్పును ధరణి ఎలా సరిచేశాడు..? మధ్యలో వెన్నెల ఎవరు..? అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. ఈ మూవీలో హీరోయిన్ కీర్తి సురేష్ డిఫరెంట్ లుక్స్ ఆకట్టుకున్నాయి. అలానే సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ అందించిన సంగీతం సన్నివేశాలకు తగ్గట్టుగా ఉంది. మూవీ అన్ని కార్యక్రమాలు ముగించి మార్చి 30న భారీ స్థాయిలో అత్యధిక థియేటర్స్‌లో విడుదల కానుంది.

# 'భువన విజయమ్' టీజర్

నటుడు సునీల్, శ్రీనివాస్ రెడ్డి, వెన్నెల కిశోర్, ధనరాజ్ ప్రధాన పాత్రలలో నటించిన చిత్రం 'భువన విజయమ్'. ఈ సినిమాతో యలమంద చరణ్ దర్శకుడుగా పరిచయం కానున్నారు. టైటిల్‌తోనే అందరి దృష్టిని ఆకర్షించిన ఈ చిత్ర టీజర్‌ను డైరెక్టర్ మారుతి లాంచ్ చేశారు. కథలోని పాత్రలను పరిచయం చేస్తూ సాగిన ఈ టీజర్ నెటిజన్లను ఆకట్టుకుంటుంది. 'ఒక కథానాయకుడు.. అతని కథేంటో అతనికే తెలీదు. ఒక ప్రొడ్యూసర్.. అతనికి జాతకాల పిచ్చి. ఒకరంటే ఒకరికి పడని ఎనిమిది మంది రచయితలు. అనుకోకుండా రైటర్‌గా మారిన ఓ దొంగ.. వీళ్ల మధ్యలో తిరుగుతున్న ఓ ఆత్మ..' రకరకాల పాత్రల నేపథ్యంలో సాగిన ఈ టీజర్‌లో నటీనటులు వారి టైమింగ్‌తో ఆకట్టుకున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 14న విడుదల కానుంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com